ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఏలూరు
జిల్లా వార్తలు
5
మంగళవారం 26 నవంబరు 2024





• శివోహం..

కార్తీకమాసం ఆఖరి సోమవారాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంతో పాటు ఆయా ఆలయాల్లో భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక వ్రతాలు నిర్వహించారు. పలుచోట్ల ఆలయ ప్రాంగణాల్లో కార్తీక దీపోత్సవాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

కోరుకొల్లు సోమేశ్వర స్వామి ఆలయంలో సామూహిక పూజలు

టీచర్ల సెలవుల జీవో నిబంధనలను ఉల్లంఘిస్తే ఉద్యమిస్తాం : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లకు సెలవు మంజూరు చేసేందుకు ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, డీవైఈవోలకు ఉన్న అధికారాలపై ఉద్దేశించిన జీవో 70 ఉత్తర్వులను జిల్లా అధికారులు ఉల్లంఘించడంపై ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సాల్మన్‌రాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర ఓ ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయులకు సెలవులను మండలానికి 10 శాతానికే పరిమితం చేస్తూ మౌఖిక ఆదేశాలు జారీ చేయడం సరైంది కాదన్నారు. జిల్లా అధికారుల ఆదేశాలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో డీఈవో కార్యాలయం వద్ద ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సూర్యాస్తమయం తొందరగా వస్తున్నందున సాయంత్రం విద్యార్థులు స్కూలు నుంచి ఇళ్లకు భద్రంగా ప్రయాణం చేయడం కష్టతరమవుతున్నందున పాఠశాలలకు పెంచిన పనివేళలను ఏజెన్సీ మండలాల స్కూళ్కు మినహాయించాలని డిమాండ్ చేశారు. 'అపార్' డేటా నమోదుకు టీచర్లపై ఒత్తిడి చేయరాదని, మార్చి నెలాఖరువరకు గడువును పొడిగించాలని కోరారు.



• ఆధార్ ..నిరీక్షణ

విద్యార్థులకు అపార్ (ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) నెంబర్లు కేటాయింపు, వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఆధార్ కార్డుల్లో తప్పులు సరిదిద్దుకునేందుకు విద్యార్థులు, ఇతర వర్గాల ప్రజల రాకతో ఆధార్ కేంద్రాల వద్ద రద్దీ నెలకొంది. గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. ఏలూరులో కొన్ని ముఖ్యమైన ప్రాంతాల్లోనే ఆధార్ నమోదు కేంద్రాలు ఉండటంతో ఆయా మండలాల నుంచి విద్యార్థులు, ఇతరులు పెద్దఎత్తున ఇక్కడకు వస్తున్నారు. గత ప్రభుత్వం మీసేవ కేంద్రాల సర్వీసులన్నింటిని గ్రామవార్డు సచివాలయాలకు బదలాయించడంతో చాలావరకు మీసేవ కేంద్రాలు మూతపడ్డాయి. ఒకటి, అర నడుస్తున్నా ఆధార్ కార్డుల్లో తప్పులు సరిదిద్దే అనుమతులు లేవు. ఇక పోస్టాఫీస్, బ్యాంకులో సిబ్బంది కొరత పేరుతో ఆధార్ కార్డుల్లో తప్పులను సవరించే పనులు తాము చేయడం లేదని చెబుతున్నారు. దీంతో పలు మండలాలకు చెందిన విద్యార్థులు, సాధారణ ప్రజలు ఏలూరు రావాల్సిన పరిస్థితి నెలకొంది.



సోమవారం ఏలూరు చైతన్య గ్రామీణ బ్యాంక్ వద్ద ఆధార్‌లో తప్పుడు సరిచేసుకొనుటకు బ్యాంక్ వద్ద విద్యార్థినులు ఇలా ఉన్నారు.

- ఏలూరు రూరల్

మా సమస్యలు పట్టవా..





ఏలూరు డిపో వద్ద నిరసన తెలుపుతున్న స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు, ఆర్టీసీ కార్మికులు (ఫైల్)

ఆర్టీసీ ఉద్యోగుల ఆవేదన

- రెండేళ్ల నుంచి అందని సెలవు జీతాలు
- కాలం చెల్లిన బస్సులతో తిప్పలు
- కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని విజ్ఞప్తి

ఆర్టీసీ ఉద్యోగులను ఎన్నో సమస్యలు వేధిస్తున్నాయి. ప్రభుత్వాలు మారినప్పుడల్లా తమ బతుకులు మారతాయని ఆశించినా నిరాశే మిగులుతోంది. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినా ఆపై వైసీపీ ప్రభుత్వం వీరి సమస్యల పట్ల కన్నెత్తి చూడలేదు. ఈక్రమంలో వీలు దొరికినప్పుడల్లా ధర్నాలు, గేట్ మీటింగ్‌లతో ఆర్టీసీ ఉద్యోగులు తమ నిరసన తెలుపుతున్నారు. కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు మూడు ఆర్టీసీ డిపోలు ఉండగా మొత్తం 1,094 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. మూడు డిపోల్లో 225 ఆర్టీసీ బస్సులు ఉండగా, మరో 75 అద్దె బస్సులు ఉన్నాయి. రోజుకు 300 ట్రిప్పులు, లక్షా 8 వేల కిలోమీటర్లు తిరుగుతున్నాయి. రోజుకు రూ.40 లక్షల ఆదాయాన్ని సమకూరుస్తున్నారు. అత్యధిక దూరంగా నూజివీడు, బెంగళూరు, ఇంకా జిల్లా నుంచి తిరుపతి, హైదరాబాద్‌కు 34 సర్వీసులను తిప్పుతున్నారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో 2020 జనవరి 1వ తేదీన విలీనం చేశారు. ప్రభుత్వంలో కలిపిన మరుక్షణమే తామంతా ప్రభుత్వ ఉద్యోగులమని తమకు సమస్యలు ఉండవని ఆశించారు. అయితే ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయి. 2012 నుంచి ఇంత వరకూ ఒక్క పల్లెవెలుగు బస్సును ఆర్టీసీ కొనుగోలు చేయలేదు. కాని కొన్ని ఖరీదు అయిన బస్సులను కొనుగోలు చేశారు. 2012 నుంచి ఇప్పటి వరకు రిక్రూట్ మెంట్ చేయకపోవడంతో ఉన్న సిబ్బందిపైనే పని భారం పెరిగింది. జిల్లాలో 70 మంది డ్రైవర్ల వరకు కొరత ఉంది. డిపోలలో మెకానిక్‌లు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఉన్న సెలవులు కూడా వాడుకోవడానికి వీలు లేకుండా ఓవర్ డ్యూటీలు సిబ్బందిపై పడుతోంది. బస్సుల కండీషన్ సరిగా లేకపోవడంతో తరచుగా మరమ్మతులకు గురై ఆగిపోతున్నాయి. సెలవు జీతాలు (సిక్ లీవ్) రెండేళ్ల నుంచి ఇవ్వక పోవడంతో అయోమయంలో పడ్డారు.

న్యాయం కోసం పోరాటం..

ప్రభుత్వంలో విలీనమైనా ఇటీవల ప్రభుత్వం ఆర్టీసీలోని కొన్ని కేటగిరి ఉద్యోగాలను గెజిటెడ్ ఉద్యోగాలుగా గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ కిందిస్థాయి సిబ్బందికి న్యాయం జరగదంటూ వాపోతున్నారు. వాహనాల కండీషన్ మెరుగుపర్చాలని, డబుల్ డ్యూటీలు వేయ కూడదని, సెలవుల జీతాలు చెల్లించాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, స్టాఫ్ రూమ్, డైనింగ్‌హాల్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఆరీస్టీలో వైద్యాన్ని కొనసాగించాలని, బస్సులను పెంచాలని, రిక్రూట్‌మెంట్లు చేపట్టాలని, కారుణ్య నియామకాలను అమలు చేయాలని, విద్యుత్ బస్సులను ఆర్టీసీలకే కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు వారం రోజుల నుంచి డిపోల వద్ద తమ నిరసన తెలుపుతున్నారు. ఆర్టీసీ కార్మికులకు ముఖ్యంగా నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్, ఎంప్లాయీస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌లు ఉన్నాయి. వీటిలో ఎంప్లాయిస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్‌కు చెందిన కార్మికులు, నాయకులు డిపోల వద్ద తమ నిరసనలను తెలుపుతున్నారు.



కేంద్ర మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కలెక్టర్ నాగరాణి

లేసు పరిశ్రమకు మరింత చేయూత

పశ్చిమ కలెక్టర్ నాగరాణి

నరసాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): లేసు మహిళలు అల్లికల్లో చూపిన నైపుణ్యం వల్లే అంతర్జాతీయ భౌగోళిక జియోగ్రాఫికల్(ఐజీ) సర్టిఫికెట్ అందుకోగలిగానని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి అన్నారు. సోమవారం ఢిల్లీలోని కేంద్ర జౌళిశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాపులో కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ చేతుల మీదుగా కలెక్టర్ ఐజీ సర్టిఫికెట్‌ను అందుకున్నారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేతి ఉత్పత్తులకు మంచి గుర్తింపు ఉంటుందన్న దానికి జాతీ య స్థాయిలో లభించిన ఐజీ సర్టిఫికెట్‌నే నిదర్శనమన్నారు. లేసు పరిశ్రమకు మరింత చేయూతనిచ్చేందుకు మార్కెటింగ్ సదుపాయంతో పాటు డిజైన్లలో కూడా శిక్షణ ఇప్పిస్తామన్నారు. ఈ వర్క్‌షాపులో నరసాపురం లేసు ట్రేడ్ సెంటర్ కన్వీనర్ కలవకొలను తులసీ పాల్గొన్నారు.

పోలీసు శాఖలో పదోన్నతి పరీక్షలు 7 ఏలూరు మీదుగా శబరిమలకు రైళ్లు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

అర్జీల పరిష్కారంలో అలసత్వం సహించేది లేదు

ఏలూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు సంబంధించి అర్జీలు జిల్లా అధికారులు తమ లాగిన్‌ను ఓపెన్ చేసి ఏరోజు కారోజు పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ విజయ్‌రాజు, ఆర్డీవో అచ్యుత అంబరీష్‌తో కలిసి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పీజీ ఆర్.ఎస్‌లో 217 అర్జీలు అందినట్టు తెలిపారు. అర్జీల పరిష్కారంలో అలసత్వం సహించేది లేదని హెచ్చరించారు.

32 ఫిర్యాదుల స్వీకరణ

ఏలూరు క్రైం : ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఆదేశాల మేరకు ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 32 ఫిర్యాదులను స్వీకరించి ఆయన సంబంధిత అధికారులకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

'తమ్మిలేరు'కు మోక్షం

- మంత్రి పార్థసారథి చొరవతో ప్రాజెక్టుకు మరమ్మతులు
- గత ఐదేళ్లుగా పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

చాట్రాయి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తమ్మిలేరు ప్రాజెక్టు మరమ్మతు పనులు ఇటీవల పునఃప్రారంభం కావడంతో ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిధులు ఉన్నా ఐదేళ్ల వైసీపీ పాలనలో అరకొర పనులతో కాలక్షేపం చేశారు. 2018లో తెలుగుదేశం హయాంలో ఈ పనులకు రూ.16 కోట్లు జైకా (జపాన్ బ్యాంకు) నిధులు మంజూరు కాగా టెండర్లు ప్రక్రియ పూర్తయి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించే సమయానికి 2019 ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో పనులకు బ్రేక్ పడింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రివర్స్ టెండర్ పేరుతో టెండర్ రద్దు చేసింది. వైసీపీ సర్కార్ 2021లో టెండర్లు పిలిచి కాంట్రాక్టర్‌ను ఖరారు చేసినా, బిల్లులు రావనే భయంతో కాంట్రాక్టర్ అరకొర పనులు మాత్రమే చేశారు. నూజివీడు ఎమ్మెల్యే గృహ నిర్మాణ మంత్రి కొలుసు పార్థసారథి చొరవతో పనులు పునఃప్రారంభం పట్ల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 30 ఏళ్ల నుంచి ప్రాజెక్టుకు సరైన మరమ్మతులు లేక జలాశయం కట్ట, తూములు, రెగ్యులేటర్ గేట్లు, పంట కాల్వలు, చెరువులు శిథిలావస్థకు చేరి నీరు అందక రైతులు నష్టపోతున్నారు. ఇటీవల మంత్రి పార్థసారథి ప్రాజెక్టును సందర్శించి ఆయకట్టు రైతులు, అధికారులతో మాట్లాడారు. చాట్రాయి మండలంలోని అన్ని గ్రామాలకు తమ్మిలేరు ప్రాజెక్టు నుంచి స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి అంచనాలు తయారు చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు.

చింతలపూడి ఎత్తిపోతల పథకం ఫేజ్-2 కాల్వ ద్వారా తమ్మలేరు ప్రాజెక్టుకు గోదావరి జలాలు అనుసంధానం చేయడానికి గత టీడీపీ ప్రభుత్వంలో డిజైన్ రూపొందించి 80 శాతం పనులు పూర్తి చేశారు. ఇది జరిగితే తమ్మిలేరు ప్రాజెక్టు ఆయకట్టుకు మహర్దశ రావడమే కాక వందల గ్రామాలకు తాగునీటి ఇబ్బందులు తీరతాయి.



తమ్మిలేరు ప్రాజెక్టు కట్టపై ఎక్స్‌కవేటర్‌తో జంగిల్ క్లియరెన్స్ పనులు

పక్కాగా ఓటర్ల నమోదు

ఓటర్ల జాబితా పరిశీలకుడు ఎంఎం నాయక్

ఏలూరు సిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : దోషరహిత ఓటరు జాబితాను పక్కాగా రూపొందించడంపై సంబంధిత అధికారులు ధ్యాస పెట్టాలని పశుసంవర్ధక శాఖ కార్యదర్శి , ఓటర్ల జాబితా అబ్జర్వర్ ఎంఎం నాయక్ చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి తో కలిసి 2025 ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణపై ఈఆర్వోలు, ఏఈఆర్వోలతో ఆయన సమీక్షించారు. తొలుత ఓటర్ల జాబితా పరిశీలకులు ఎంఎం నాయక్‌కు కలెక్టర్‌తో పాటు జేసీ ధాత్రిరెడ్డి పూలమొక్కలు అందజేసి స్వాగతం పలికారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2025 ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయా అంశాలను వివరించారు.



సమాచార హక్కు చట్టం ఉల్లంఘనపై..

32 పంచాయతీల కార్యదర్శులకు.. షోకాజ్ నోటీసులు

ముదినేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సమాచార హక్కు చట్టాన్ని ఉల్లంఘించి నందుకు ముదినేపల్లి మండలంలోని అన్ని పంచాయతీల కార్యదర్శులకు సోమవారం మండల పంచాయతీల విస్తరణాధికారి బి.అశోక్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఏలూరు జిల్లా నిడమర్రుకు చెందిన సంకెళ్ల రాంబాబు ముదినేపల్లి మండలంలోని 32 పంచాయతీల్లో సీఎంఎఫ్ఎస్ కింద నిధుల వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని ఈ ఏడాది మార్చి 3న ఎంపీడీవోను కోరుతూ సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేశారు. అర్జీ దాఖలు చేసి ఎనిమిది నెలలు గడుస్తున్నా నేటికీ ఒక్క పంచాయతీకి సంబంధించిన వివరాలు కూడా కార్యదర్శులు ఎంపీడీవోకు అందలేదు. సెప్టెంబరు 30, అక్టోబరు 22, 25 తేదీల్లో మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీల కార్యదర్శుల సమావేశాల్లో రాంబాబు ఇచ్చిన అర్జీపై సమీక్షించినా కార్యదర్శులు సమాచారం ఇవ్వలేదు. అర్జీదారుడు కోరిన సమాచారాన్ని నిర్ణీత గడువులోగా ఇవ్వనందుకు మండలంలోని 32 పంచాయతీల కార్యదర్శులకు ఈవోపీఆర్డీ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అర్జీదారుడు కోరిన సమాచారాన్ని ఎందుకు ఇవ్వలేదో, కారణాలు ఏమిటన్నది 48 గంటల్లోగా సంజాయిషీ ఇవ్వాలని పేర్కొన్నారు.

పింఛన్‌లపై కొత్త మార్గదర్శకాలు విడుదల

జిల్లాలో మొత్తం 2,64,966 మంది పింఛన్‌దారులు

ఏలూరుసిటీ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటివరకు పింఛన్‌దారులు పడుతున్న ఇబ్బందులను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం గమనించింది. వారి సమస్యలకు పరిష్కారం కోసం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పథకంలో కొత్త మార్గదర్శకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. గతంలో ఒక కుటుంబంలో పింఛన్ పొందుతున్న వ్యక్తి మరణిస్తే అతని భార్యకి అర్హత ఉండి పింఛన్ ఇవ్వాలంటే మళ్ళీ దరఖాస్తు చేసుకోవాల్సి వచ్చేది. ఆక్రమంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వచ్చేది. ప్రస్తుతం ఈ కష్టాలేవీ లేకుండా ఒక కుటుంబంలో పింఛన్ పొందుతున్న భర్త మరణిస్తే అతని భార్యకు పింఛన్ పొందే అర్హత ఉంటే వెంటనే మార్పు చేస్తారు. దీనికి కేవలం అతని మరణ ధ్రువపత్రం సమర్పిస్తే సరిపోతుంది. అలాగే రెండు నెలలు ఏదైనా కారణం వల్ల లబ్ధిదారుడు పింఛన్ మొత్తాన్ని తీసుకోకపోయినా మూడో నెలలో మొత్తాన్ని తీసుకునే అవకాశం కల్పించారు. పింఛన్‌లు పొందుతున్న దివ్యాంగ విద్యార్థులు విద్యా భ్యాసం కారణంగా వేరే ప్రాంతాల్లో విద్యనభ్య సిస్తూ ఉంటే వారు తాము ఎక్కడ చదువుతు న్నారో వివరాలు అందజేసి, వారి బ్యాంకు ఖాతా వివరాలను అందజేస్తే వారి బ్యాంకు ఖాతాలకు పింఛన్ జమయ్యే ఏర్పాట్లను చేస్తున్నారు. జిల్లాలో 2లక్షల 64,966 మంది పింఛన్ లబ్ధిదారులున్నారు. వీరందరికీ కొత్తమార్గ దర్శకాల వల్ల కొంత ఊరట కలిగిందని చెప్పవచ్చు.

వాయు'గండం'

- ఆందోళనలో రైతులు
- ముమ్మరంగా వరి మాసూళ్లు
- ఇప్పటివరకు 40 శాతమే పూర్తి

ఏలూరుసిటీ/కలిదిండి/ ముదినేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర అల్పపీడనంగా మారింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా పయనించి సోమవారం వాయుగుండంగా బలపడింది. ఈ కారణంగా ఈనెల 26,27 తేదీల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. అయితే ఈ ప్రభావం కేవలం దక్షిణ కోస్తా ప్రాంతంలోనే ఎక్కువ ప్రభావం ఉంటుందని, ఉత్తర కోస్తాలో అంతంత మాత్రంగానే ప్రభావం ఉంటుందని చెబుతున్నా జిల్లాలోని సార్వా వరి సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం శ్రమించి పంటను పండిస్తే ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురిస్తే దిగుబడులపై ప్రభావం ఎక్కువగా కనిపిస్తుందని, ఆర్థికంగా తాము నష్టపోతామని రైతులు చెబుతున్నారు. ఈనెల 26, 27 తేదీలలో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని, ఇప్పటికి వరకు 40 శాతమే వరి మాసూళ్లు పూర్తయ్యాయని జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలు అనుసరించి మాసూళ్లు నిర్వహించుకోవాలని, వర్షాలు వస్తే కోసిన ధాన్యం తడిచి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. సోమవారం సాయంత్రం జిల్లాలో మబ్బుల వాతావరణం నెలకొంది. కలిదిండిమండలంలో 50 శాతం వరి కోతలకు సిద్ధమవుతున్నారు. ఈ పరిస్థితుల్లో భారీ వర్షాలు కురిస్తే పైరు నేలకొరిగి నీటిపాలై ప్రమాదం ఉందని రైతులు దిగాలు చెందుతున్నారు. చేపల, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ కొరత ఏర్పడే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖ అధికారి తెలిపారు. ముదినేపల్లి మండలంలో సుమారు ఐదు వేల ఎకరాల్లో వరి కోతలుపూర్తి కాగా సుమారు 4 వేల ఎకరాల్లో కోతకు సిద్ధం గా ఉన్న వరి పైరు పడిపోయి పాడైపోయే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



కోరుకొల్లులో కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యాన్ని ఒబ్బిడి చేస్తున్న రైతులు



ముదినేపల్లి ప్రాంతంలో బరకాలు కప్పిన ధాన్యం రాశులు



చిగురిస్తున్న ఆశలు

తణుకులో 30 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి అడుగులు
అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆరిమిల్లి ప్రస్తావన
గతంలోనే ప్రతిపాదనలు
వేల్పూరులో స్థలం కేటాయింపు
వైసీపీ ప్రభుత్వం రాకతో మూలకు..

తణుకు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తణుకు ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణంపై కార్మికులుకు ఆశలు చిగురిస్తున్నాయి. ఏళ్ళ తరబడి సొంత భవనం, కనీస సౌకర్యాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్మికులు సమస్యలపై ఇటీవల అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రస్తావించారు. ఆసుపత్రి నిర్మాణం గురించి మాట్లాడారు. గతంలోనే 30 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం ప్రతిపాదన చేశారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు వేల్పూరులోని బైపాస్ రోడ్డు సమీపంలో 1.14 సెంట్లు భూమిని ఆసుపత్రి నిర్మాణం కోసం కేటాయించారు. ఈఎస్ఐ ఉన్నతాధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో ప్రతిపాదన అటకెక్కింది. కూటమి ప్రభుత్వంలో ఆసుపత్రి నిర్మాణం జరిగితే కార్మికుల కల తీరినట్టే.

30 వేల వరకు కార్మికులు

పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన తణుకులో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రి పరిధిలో 20 వేల కార్మికులు నమోదై ఉన్నారు. వారితో పాటు కుటుంబ సభ్యులు కలసి మరో పదివేలు ఉంటారు. తణుకుతో పాటు తాడేపల్లిగూడెం, పాలకొల్లు, భీమవరం, వేంద్ర పరిశ్రమలతో పాటు చుట్టు పక్కల స్పిన్నింగ్, స్ట్రా బోర్డు, పేపరు బోర్డు పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ పనిచేసే కార్మికులు తణుకు ఆసుపత్రికే వస్తారు. వీరికి అవసరమైన చికిత్సల కోసం రాజమండ్రి లేదా విజయవాడ వెళ్లాల్సివస్తోంది.

అరకొర సేవలే

ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలో ఉండాల్సిన వైద్యులు, సిబ్బంది, మందులు వంటివి కూడా పూర్తి స్థాయిలో లేవు. కనీసం సుగర్ పరీక్షలు కూడా చేయలేని దుస్థితిలో ఉంది. అనేక సంవత్సరాలుగా మహిళా వైద్యులు లేరు. రక్త పరీక్షలకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉండటం లేదు. ఇన్సులిన్ సూదులు, టీటీ ఇంజక్షన్‌లు ఉండవు, ఎక్స్‌రే, ఈసీజీ అంటే బయట తీసుకోవాలి. సుగర్ పరీక్షలు చేయడం లేదు. మందులు కూడా సరైనవి ఇవ్వడం లేదని కార్మికులు చెబుతున్నారు. ఆసుపత్రికి వెళ్ళినపుడు ఆన్‌లైన్‌లో కార్మికుడి పేరు ఒకసారి కనిపిస్తే మరో సారి కనిపించదు. దీంతో ఎంతోదూరం నుంచి వచ్చిన కార్మికులు తీవ్ర నిరాశతో వెనుతిరిగి వెళ్ళాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. కనీసం ఇలాంటి సాంకేతిక సమస్యలు కూడా పరిష్కరించడం లేదు.

సిబ్బంది కొరత

డిస్పెన్సరీలో 14 మంది సిబ్బంది ఉండాల్సి ఉంది. కానీ ఏడుగురు మాత్రమే ఉన్నారు. మరో ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా ఇద్దరు వైద్యులు ఉండాలి. ఒక వైద్యుడు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. మరో వైద్యుడు రాజమహేంద్రవరం నుంచి వారానికి మూడు సార్లు వచ్చి సేవలందిస్తారు. అవుట్ సోర్సింగ్ విధానంలో ఇద్దరు నర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. మిగిలిన పోస్టులు భర్తీ అవుతాయో లేదా అనేది ప్రశ్నార్థకంగా మారిందికూ

ప్రక్షాళన చేయాలి



డిస్పెన్సరీలో అన్ని రకాల పరీక్షలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యురాలిని నియమించాలి. ఆసుపత్రి ప్రాంతంలో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి. మందులు ఎపుడు ఒకే కంపెనీకి చెందినవి ఇవ్వాలి. ప్రతి మూడు నెలలకు మందులు మార్చడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలి.

పీపీ ప్రతాప్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

సమయాలు మార్చాలి





కార్మికులకు ఆరోగ్యం బాగాలేకున్న కావా ల్సిన సెలవులు మంజూరు చేయడం లేదు. బయట రక్తపరీక్షలు తీసుకొస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు. అనారోగ్యంతో వచ్చిన కార్మికులు ఇబ్బందులు తప్పడం లేదు. పని వేళల్లో మార్పులు తీసుకురావాలి. గతంలో ఉన్నట్టు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు, తర్వాత 4 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పనిచేయాలి.

ఆదినారాయణ, సీఐటీయూ మండల అధ్యక్షుడు, గుబ్బల గోపి, కార్యదర్శి

ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు

ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్యే



తణుకులో ముప్పయి పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం కోసం అన్ని రకాలుగా కృషి చేస్తున్నాను. గతంలో కార్మికులు అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని వేల్పూరులో స్థలం కేటాయించాం. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నాను. దశలవారీగా ఆసు పత్రిలో అన్ని సేవలు అందించేలా చర్యలు తీసుకుంటాం. కార్మికుల శ్రేయస్సు కోసం అన్ని చర్యలు తీసుకుంటాం.

సివిల్స్ ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : సివిల్స్ ఉచిత శిక్షణకు దరఖాస్తు చేసుకున్న ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని ఆరు జిల్లాలకు చెందిన అభ్యర్థులకు ఈ నెల 27న స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు కేఎన్ జ్యోతి తెలిపారు.ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్క్రీనింగ్ పరీక్షకు రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సమీపంలోని బీసీ స్టడీసర్కిల్ కార్యాలయం వద్దకు హాజరుకావాలన్నారు. అభ్యర్థులు తమ ఆధార్‌కార్డులు తీసుకుని ఉదయం 10 గంటలకు బీసీ స్టడీ సర్కిల్ వద్దకు రావాలన్నారు.

నిత్య అన్నదానానికి రూ.2 లక్షల విరాళం

యలమంచిలి, నవంబరు 25,(ఆంధ్రజ్యోతి) :యలమంచిలి మండలం అడవిపాలెం పంచముఖ అంజనేయస్వామి ఆలయంలో నిత్య అన్నదానానికి దాతలు విరాళంగా రూ.2 లక్షలు నగదును మంత్రి నిమ్మల రామానాయుడు చేతుల మీదుగా సోమవారం ఆలయ కమిటీకి అందచేశారు. దాత గుడాల వెంకట సత్యనారాయణమూర్తి, కుటుంబ సభ్యులు రూ.1 లక్ష అలాగే బందారు లంక గ్రామానికి చెందిన దాత వీరవల్లి రమేష్ (మాస్టారు) రూ.1 లక్ష అందజేశారు. పెచ్చెట్టి బాబు, బోనం నాని, చెల్లబోయిన శ్రీనివాసు పాల్గొన్నారు.



పలుచనైన పాల ధార



పల్లెలు పాడి పంటలతో అలరారేవి.. ఉదయం పాలకావిడి భుజాన వేసుకుని రైతులు పాలాల బాట పట్టేవారు.. ప్రతి ఇంటా పాడి ఉండేది.. పాలు పుష్కలంగా లభించేవి... లేనివారికి ఉచితంగా కూడా ఇచ్చేవారు.. ఇప్పుడు గ్రామాల్లోనే పాడిసంపద తగ్గి పోయింది.. 70 శాతం పైగా పాడి రైతులు పశువుల పెంపకం వదిలేశారు.. పెరిగిపోయిన దాణా ఖర్చులు, పనిచేసేవారు లేకపోవడం వంటి కారణాలతో పాడి పెంపకానికి రైతులు సెలవు చెప్పారు.. నేడు ప్రపంచ పాల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

భారంగా పాడి పశువుల పెంపకం
సగానికి పడిపోయిన పాల ఉత్పత్తి
రైతులు కూడా ప్యాకెట్లు కొనే పరిస్థితి
పల్లెల్లో కనిపించని పాలకేంద్రాలు
పెరిగిపోయిన దాణా ఖర్చు..
పాడి రైతుల్లో నిరాసక్తత

నేడు ప్రపంచ పాల దినోత్సవం

భీమవరం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో పాలధార తగ్గిపోయింది.. దాదాపు సగంపైగా పాల ఉత్పత్తి పడిపోయింది. పశువుల పెంపకంపై రైతుల్లో ఆసక్తి తగ్గిపోయింది పెంపకం కష్టంతో పాటు పెట్టు



బడి భారం అవడంతో పాడిరైతులు వెనకడుగు వేశారు. రైతులు కూడా పాడి పెంచలేక ప్యాకెట్లు కొంటున్నారు. పదేళ్ల కిందటి పాడి పశువుల పెంపకానికి ఇప్పటికీ ఎంతో మార్పు వచ్చింది సగంపైగా పాడి పశువుల పెంపకం పడిపోయింది. దీంతో పశ్చిమ గోదావరి జిల్లాలో లక్ష 78 వేలు 137 గేదెలు, దూడలు, 45,539 ఆవులు, దూడలు పెంపకం జరుగుతోంది. వీటిలో 90 వేల వరకు గేదెలు పాలు ఇచ్చేవి ఉంటాయి. మిగిలినవి చూడి , ఇంకా పాలు నిలిచిపోయినవి ఉంటాయి. ఆవులు కూడా 25 వేలు ఆవులు పాలు ఇస్తున్నట్లు అంచనా. మొత్తం మీద ఆవులు, గేదెలు పాలు ఉత్పత్తి రోజు 5 లక్షల 50 లీటర్లు వరకు ఉంటుంది. జిల్లాలో జనాభాను బట్టి 10 లక్షలు లీటర్లు వరకు పాల వాడకం ఉంటుంది. అలాగే ఏలూరు జిల్లాలో కూడా మరో పది లక్షల లీటర్ల పాలు వాడుతుంటారు. పాడి పశువుల నుంచి వచ్చిన పాలు కాకుండా సగానికి పైగా ప్యాకెట్ పాలనే ఉపయోగిస్తున్నారు. గతంలో 90 శాతం పాలు పాడి పశువుల నుంచి వచ్చినవే ఉపయోగించేవారు.

పెట్టుబడి భారం..

కాలాన్ని బట్టి అన్ని ధరలు పెరిగినట్లుగా గేదెల ధరలు భారీగా పెరిగాయి. రూ.60 వేలు ధర నుంచి 1 లక్ష 20 వేల వరకు గేదె ధర పలుకుతోంది. దానికి దాణాగా నెలకు రూ.1000 పైన పెట్టాలి. పశువు పెంచడానికి ప్రస్తుత కూలీని బట్టి లెక్క కడితే రోజుకు రూ.500 అవుతుంది. ఈ లెక్కన ఒక పశువు పెంచడానికి నెలకు 20 వేలు అవుతుంది. దాని నుంచి పాల ద్వారా వచ్చేది రూ.15 వేలు ఉంటుంది. ఈ లెక్కన పశువుల పెంపకం తగ్గింది. కొనుగోలు వరిసాగు రైతులే పాడి పశువులు పెంచుతున్నారు.

పాల కేంద్రాలు ఫెయిల్..

పాల ఉత్పత్తి పెంచేందుకు, పశువుల పెంపకం దారులకు సపోర్టు ఇచ్చేందుకు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన పాల కేంద్రాలు ఫెయిల్యూర్ అయ్యాయి. పాల కేంద్రాలకు పాలు అమ్మిన రైతులకు పెద్దగా ఆదాయం కనిపించలేదు. ఇంటింటికి అమ్మకాలు చేసుకుంటేనే కాస్త మిగులుతోంది. చాలామంది రైతులు కేంద్రాలకు పాలు పొయ్యడం లేదు.

ఉత్పత్తి తగ్గింది.. ధర పెరిగింది..

పశువుల పెంపకం గ్రామాల్లో తగ్గిపోవడంట పాల ఉత్పిత్తి పడిపోయింది. దీంతో పాల ధర పెరిగిపోయింది. లీటర్ పాలు రూ.60 నుంచి 80 వరకు అమ్ముతున్నారు. కొన్ని చోట్ల లీటరు రూ.100 కూడా అమ్ముతున్నారు. పాలు చిక్కదనం బట్టి రేట్లు ఉంటున్నాయి. దీంతో పాల ఉపయోగంలో పొదుపు మొదలైంది. ఒక కుటుంబంలో రెండు లీటర్లు అవసరమైన వారు లీటరు పాలుతో సరిపెట్టుకుంటున్నారు. గతంలో ఒక కుటుంబం నాలుగు లీటర్లు పైగా పాలు ఉపయోగించేవారు. అప్పట్లో పాలు పెద్ద కుటుంబాలు లేని వారికి ఉచితంగా కూడా అందించేవారు.

నెయ్యి బదులు డాల్డా..

పాల నుంచి ఉత్పత్తి అయ్యే నెయ్యి వాడకం బదులు కృత్రిమంగా ఉపయోగించే డాల్డా ఉపయోగం పెరిగింది. స్వీట్లు, ఇతర వంటకాలలో డాల్డా 90 శాతం వాడేస్తున్నారు. స్వచ్ఛమైన నెయ్యి కరువైంది. దీనికి కారణం పాలు సరిపడగా ఉండకపోవడం.. పౌడర్ పాల ప్యాకెట్ల నుంచి నెయ్యి రాదు.. అందుకే సచ్ఛమైన నెయ్యి దొరకడం కష్టంగా మారింది. శుభకార్యాలలో, భోజనాలకు ఉపయోగించే పెరుగును కంపెనీల పెరుగులనే ఉపయోగిస్తున్నారు.

పెంపకం భారమైంది



పాడి పశువుల పెంపకంలో చాలా మార్పు వచ్చింది. ఇప్పుడు పశువుల పెంపకం ఖరీదుగా మారింది. పాల ఉత్పిత్తి తక్కువ..కష్టం, పెట్టుబడి ఎక్కువ అయ్యింది. అందువల్ల ఇంటికో పాడి పశువు కాస్తా పది ఇళ్ళకు ఒకటిగా మారింది. గేదెపాలు అలవాటు పడినవారు కష్టమైనా పశువులు పెంచుతున్నారు.

- కె.పద్మారావు ,పశువుల పెంపకం దారుడు, భీమవరం మండలం

ఖర్చు లెక్కవేస్తే కొనడమే మేలు



వ్యవసాయం చేస్తూ పశువులను అలవోకగా పెంచేవాళ్లం. ఇంట్లో పాడి నిండుగా ఉండేది. ఇప్పుడు అలా లేదు. గేదె ధరలు పెరిగిపోయాయి. దాణా బస్తా రూ.1300 అయ్యింది. ఎండు గడ్డి ట్రాక్టర్ 10 వేలు అయ్యింది. ఇవన్నీ లెక్క వేస్తే పాలు కొనుగోలు మేలనిపిస్తుంది. స్వచ్ఛమైన పాలు దొరకక గేదెలను పెంచుతున్నాను.

-బ్రహ్మయ్య, పాడి రైతు, తాడేరు గ్రామం

అమ్మ మాటకు ఆదరణ





యూట్యూబ్ ద్వారా లక్షలమందికి చేరువైన జయ ఆనంద్

అమ్మమాట.. అంటూ ఆమె అందరికీ దగ్గరైంది.. ప్రతిరోజూ తన దైనందిన జీవితంలో జరిగే అన్ని విషయాలతో పాటు ఆధ్యాత్మిక, సామాజిక అంశాలపై ఆమె చెప్పే మాటలు ఆకట్టుకుంటాయి.. చక్కని భాషతో తీయని గొంతుతో రోజూ ఆమె చెప్పే కబుర్లు వినేందుకు వేల సంఖ్యలో సబ్‌స్క్రైబర్స్ ఉన్నారు. అమ్మ మాట.. ఈ యూట్యూబ్ చానల్ బాగా ట్రెండింగ్‌లో ఉంది.. ఎన్నో సబ్జెక్ట్‌లతో సామాజిక మాధ్యమాలు వీక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నాయి..కానీ కొన్ని ఛానల్స్ ప్రత్యేకతతో ఉంటాయి. అమ్మ మాట విభిన్నమైన అంశాలతో ప్రతీరోజు ఉదయాన్నే వీక్షకులను పలకరిస్తుంది. భీమవరానికి చెందిన కర్రి జయ ఆనంద్ తన వాయిస్‌తో ఎంచుకున్న అంశాన్ని విపులంగా వివరించడం ద్వారా విజయవంతమయ్యారు. ఇప్పుడు యువతరం రకరకాల టెక్నిక్‌లతో యూట్యూబ్‌లో ఆకర్షించే ప్రయత్నాలు చేస్తుంటే జయ ఆనంద్ మాత్రం 58 ఏళ్ల వయస్సులో తనకంటూ ఒక కొత్త ఇమేజ్‌ని సృష్టించుకుని లక్షలాది మంది వీక్షకుల అభిమానాన్ని పొందడం వెనుక ఎంతో కృషి ఉంది. ప్రతీరోజు మధ్యాహ్నం ఒంటిగంటకు అమ్మ మాట కొత్త వీడియో స్ట్రీమింగ్‌లోకి వస్తుంది. ఆ సమయంలో వచ్చే సీరియల్‌లను కూడా చూడమని అమ్మ మాట కోసం ఎదురు చూస్తామని ప్రేక్షకులు ప్రతీ రోజు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఉంటారు. భీమవరంలో లోకల్ న్యూస్ ఛానల్‌కు రెండు దశాబ్దాల పాటు న్యూస్ రీడర్‌గా సుపరిచితమైన ఆమె ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా ఎంతోమంది అభిమానాన్ని పొందుతున్నారు. ఈ ఛానల్‌లో ఆధ్యాత్మిక చింతన, లైఫ్ స్టైల్, మానవ సంబంధాలు, బ్యూటీ , మహిళలు ఎదుర్కొనే కుటుంబ సమస్యలను ప్రస్తావిస్తూ వీడియోలు చేస్తున్నారు. జీవితంలో ప్రాక్టికల్‌గా ఎదురయ్యే సమస్యలను జోడిస్తూ వాటికి పరిష్కారం కూడా వీక్షకులను ఆకట్టుకునే విధంగా చెప్పగలగటం జయ ఆనంద్ సొంతం. వీక్షకుల మనోభావాలకు అనుగుణంగా కంటెంట్‌ను రూపొందించుకోవడమే తన విజయమని ఆమె చెబుతున్నారు. తన సూచనలు, సలహాల ద్వారా ఇతరుల సమస్యల పరిష్కారమైతే తన శ్రమకు ఫలితం లభించినట్టే.. అంటున్నారు.. ఇప్పటి వరకు 3 లక్షల 65 వేల మందికి పైగా వ్యూయర్స్ ఉన్నారని ఆమె చెప్పారు. కొంత మంది వీక్షకులు భీమవరం గునుపూడిలో ఉన్న ఆమె నివాసానికి వచ్చి వారితో సంభాషించి తమ అభిమానాన్ని చాటుకుంటూ ఉంటారు.

- భీమవరం రూరల్



మహిళల బాస్కెట్ బాల్ జట్టు ఎంపిక

పెనుమంట్ర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : మార్టేరు వైబీఏ ఆధ్వర్యంలో నిర్వహించే ఎమ్మెల్యే బాస్కెట్‌బాల్ కప్ టోర్నమెంట్‌కు మహిళల జట్టును ఎంపిక చేసినట్లు వైబీఏ అధ్యక్షుడు చిర్ల బాలాజీ రెడ్డి తెలిపారు. లీలావతి, భవానీదేవి, అనిత, నాగదేవి, జ్యోతి, వినయశ్రీ, లక్ష్మీ ప్రవల్లిక, జయశ్రీ నిఖిలరెడ్డి రుత్విక ,పూజిత, పూర్ణచంద్రిక, యామిని ఎంపికయ్యారు.



కరాటే ఛాంపియన్‌గా భీమవరం విద్యార్థి

ఆకివీడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) :.రాష్ట్ర స్థాయి కరాటే పోటీల అసోసియేషన్ సభ్యుడు షేక్ ఎజిదాన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆకివీడు షాదీఖానాలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో భీమవరం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థి వై.గీత్‌పవన్ ఛాంపియన్‌గా నిలిచాడు. తెలంగాణ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ చైర్మన్ మహమ్మద్ జహంగీర్ కప్ అందజేశారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఏడు జిల్లాల నుంచి సుమారు 700 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఏపీ, తెలంగాణ కరాటే మాస్టార్లను ఘనంగా సన్మానించారు.

హర..హర మహాదేవ







కార్తీకమాసం ఆఖరి సోమవారం ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది.. కార్తీక దీపాలు, అభిషేకాలు, పూజలతో ఆలయాలు కిటకిటలాడాయి..

భీమవరం మావుళ్లమ్మ ఆలయంలో కోటి దీపోత్సవ దృశ్యాలు



గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయంలో భక్తుల క్యూ





నరసాపురం వలందర్‌రేవులో దీపాలు వదులుతున్న భక్తులు





నిడమర్రు మండలం మందలపర్రులో హారతి



గునుపూడి సోమేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

హనుమాన్ విగ్రహం మాయం

అర్ధరాత్రి ఏర్పాటు చేశారు.. ఉదయానికి లేదు..!

ఆచంట వేమవరంలో గుర్తుతెలియని వ్యక్తుల చర్యలు


మాయమైన ఆంజనేయుడి విగ్రహం ఇదే

ఆచంట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆచంట వేమవరంలో ఆదివారం అర్ధరాత్రి ప్రతిష్ఠించిన ఆంజనేయుడి విగ్రహం ఉదయానికి మాయం కావడం చర్చనీయాంశమైంది. ఆచంట నుంచి పాలకొల్లు రహదారి పక్కన ఎ.వేమవరం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఉదయం ఈ విగ్రహాన్ని చూసిన ప్రతీ ఒక్కరూ రాత్రికి రాత్రే విగ్రహం ఎవరూ నెలకొల్పారు అంటూ గ్రామస్థులు తర్జనబర్జనపడ్డారు. మరలా ఉదయం పది గంటల తరువాత ఎవరికీ తెలియకుండానే విగ్రహం మాయమైంది. ఈ సంఘటనతో స్థానికులు ఆశ్చర్యపోయారు. గ్రామంలో చర్చనీయాంశం కావడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. విగ్రహం ఏర్పాటుచేసి కొన్ని గంటల సమయంలో మాయం చేయడం స్థానికంగా సంచలనంగా కలిగించింది. ఈ సంఘటనకు కారకులెవరు.. ఎందుకు ఇలా చేశారుని అందరూ చర్చించుకుంటున్నారు.

ఇప్పటికే విగ్రహాలు, ఫ్లెక్సీల వివాదం

గ్రామంలోని పార్వతి చెరువు ప్రాంతంలో వైసీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఇదే చోట బాబూజగ్జీవన్‌రాం, అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నించగా అప్పట్లో వివాదం ఏర్పడింది. దీంతో బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదు. ఇటీవల చాకిరేవు చెరువు వద్ద రెండు కులాల వారి విగ్రహాల ఏర్పాటులో వివాదం నెలకొంది. స్థానిక రైతు అధికారులు విగ్రహాల ఏర్పాటును అడ్డుకునే ప్రయత్నం చేశారు. తాజాగా అర్ధరాత్రి సమయంలో ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు, ఉదయానికి మాయం చేయడం గందరగోళానికి దారితీసింది. కావాలనే కొంత మంది గొడవలు పెట్టడానికి ఇలా చేసి ఉంటారని పలువురు భావిస్తున్నారు.

ఏలూరు మీదుగా శబరిమలకు రైళ్లు



ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేకంగా విశాఖపట్నం, శ్రీకాకుళం నుంచి శబరిమలై ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ డివిజన్ అధికారులు సోమవారం తెలిపారు. విశాఖపట్నం - కొల్లాం (రైల్‌నెంబర్ 08539) డిసెంబర్ 4న విశాఖలో ఉదయం 8.20 గంటలకు బయలుదేరి 5న 12.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ రైలును 2025 ఫిబ్రవరి 26 వరకూ నడపనున్నారు. విశాఖపట్నం - కొల్లాం (08540) రైలు కొల్లాంలో డిసెంబర్ 5న కొల్లాంలో రాత్రి 7.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ రైలును డిసెంబర్ 5 నుంచి 2025 ఫిబ్రవరి 27 వరకూ నడపనున్నారు. శ్రీకాకుళం రోడ్డు - కొల్లాం (08553) రైలు శ్రీకాకుళం రోడ్డులో డిసెంబర్ 1న ఉదయం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ రైలును డిసెంబర్ 1 నుంచి 2025 జనవరి 26 వరకూ నడపనున్నారు. కొల్లాం - శ్రీకాకుళం రోడ్డు (08554) రైలు డిసెంబర్ 2న కొల్లాంలో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి 4న అర్ధరాత్రి 2.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుంది. ఈ రైలును డిసెంబర్ 2 నుంచి జనవరి 27 వరకూ నడపనున్నారు. విశాఖపట్నం - కొల్లాం - విశాఖపట్నం నడిచే రైళ్లు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణికుంట, కాట్పాడి, జాలర్‌పెట్టయ్, సేలం, ఈరోడ్, తిరుపూర్, పొదనూర్, పాల్కాట్, తిరుచూర్, ఆల్వా, ఎర్నాకుళంరోడ్డు, కొట్టాయం, చత్రగంజి, తిరువెళ్ళ చెంగనూర్, మేవలికెర, కాయంకులం స్టేషన్లలో ఆగనున్నాయి. శ్రీకాకుళం రోడ్డు - కొల్లాం - శ్రీకాకుళం రోడ్డు రైళ్లు పొందూరు, చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు. గూడూరు, రేణికుంట, కాట్పాడి, జాలర్‌పెట్టయ్, శాలం, ఈరోడ్, తిరుపూర్, పొదనూర్, పాల్కాట్, తిరుచూర్, ఆల్వా, ఎట్టుమన్నూర్, ఎర్నాకుళం టౌన్, కొట్టాయం, చత్రగంజి, తిరువెళ్ళ చెంగనూర్, మేవలికెర, కాయంకులం స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్లలో టూటైర్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు.

రాష్ట్రంలో ఖాళీ పోస్టులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర


మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్ర

పాలకొల్లు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ సమస్య పరిష్కారానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగాల ఖాళీలపై శ్వేతపత్రం విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర అన్నారు. తక్షణమే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రెస్‌క్లబ్‌లో సోమవారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో రాజేంద్ర మాట్లాడారు. సీఎం చంద్రబాబు అధికారం చేపట్టి ఆరు నెలలైందని, ఎమ్మెల్సీ ఎన్నికల (టీచర్స్, గ్రాడ్యుయేట్స్) అనంతరం కాలయాపన చేయకుండా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్‌లో గతంలో జరిగిన సంఘటనల దృష్ట్యా ఏ జిల్లాకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం వివిధ శాఖల్లో 2,35,794 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. గత ఆరేళ్లుగా పోస్టులు భర్తీ చేయలేదని అందువల్ల నిరుద్యోగులు వేలాది మంది వయోపరిమితి దాటిపోవడం జరిగిందన్నారు. ఏఐవైఎఫ్ 22వ మహాసభలు 2025 ఫిబ్రవరి 6నుండి 9వ తేదీ వరకూ శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించనున్నట్టు ఈసందర్భంగా రాజేంద్ర తెలిపారు సమావేశానికి జిల్లా నాయకుడు పవన్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా, నియోజక వర్గ నాయకులు పాల్గొన్నారు.

13 నుంచి 'అభినయ' జాతీయ నృత్యోత్సవాలు

ఏలూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో అభినయ నృత్యభారతి ఆధ్వర్యంలో జాతీయ నృత్యోత్సవాలు డిసెంబర్ 13, 14, 15 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు సంస్థ గౌరవాధ్యక్షుడు అంబికాకృష్ణ, వ్యవస్థాపకులు డి.హేమసుందర్ తెలిపారు. పోటీల కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. సుమారు పది రాష్ట్రాల యువ కళాకారులు, నృత్య కౌముది అవార్డులు స్వీకరించనున్నారని హేమసుందర్ తెలిపారు. ఉభయ తెలుగురాష్ట్రాలకు చెందిన 400మంది చిన్నారులు కూచిపూడి, జానపద బృంద నృత్య పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. పోటీల అనంతరం నృత్య రంగంలో సేవలందించిన గురువులు, వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారికి నృత్య తపస్వి, సేవా తపస్వి అవార్డులు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వై.జగన్‌మోహన్‌రావు, కె.వేణుబాబు తదితరులు పాల్గొంటారని తెలిపారు.


తరలించేందుకు సిద్ధం చేసిన జామాయిల్ దుంగలు, ఏపీఎఫ్‌డీసీ దర్భగూడెం బీట్‌లో లారీ

జామాయిల్ తరలింపు యత్నం

అధికారులకు సమాచారం అందడంతో లారీ వదిలి పరార్

జీలుగుమిల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎపీఎఫ్‌డీసీ (ఏపీ ఫారెస్టు డవలప్‌మెంట్ కార్పొరేషన్) దర్భగూడెం బీట్ పరిధిలో జామాయిల్ కలప తరలించేందుకు కొందరు ప్రయత్నించారు. రెండు రోజుల క్రితం జామాయిల్ అడవిలోకి నేరుగా కూలీలతో లారీ వచ్చింది. అడవిలో ఎండిన జామాయిల్ కర్రలు తరలించేందుకు రంగం సిద్ధం చేశారు. కూలీలతో లారీపై లోడు చేస్తుండగా గిరిజనులు అడగడంతో తమకు అనుమతులు ఉన్నాయని చెప్పారు. ఈ విషయం కార్పొరేషన్‌లో కిందిస్థాయి సిబ్బంది ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనితో కలప తరలించడానికి సిద్ధమైన వారు లారీలో కొన్ని జామాయిల్ దుంగలు మరోచోట దించారు. మిగిలిన కర్రలు లారీ వద్ద దిగుమతి చేసి పరారయ్యారు. ఏపీఎఫ్‌డీసీ ప్లాంట్ మేనేజర్ వసంతకుమారి సిబ్బందితో కలసి సోమవారం విచారించారు. లారీకి సంబంధించిన వారు అందుబాటులో లేరని, దీని వెనుక కిందిస్థాయి ఉద్యోగుల హస్తం ఉన్నట్లు కొందరు చెబుతున్నారు. ఈ సంఘటనపై సంబంధిత అధికారి కోసం ప్రయత్నించగా ఆమె ఫోన్ అందుబాటులోకి రాలేదు. అ సంఘటనపై అధికారుల విచారణ జరుపుతున్నట్లు సమాచారం.

వీధి వ్యాపారులకు రుణాలు


పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఉభయగోదావరి జిల్లాలోని వీధి వ్యాపారుల కోసం ప్రధానమంత్రి వీధి విక్రయదారుల ఆత్మ నిర్భర నిధి కింద 'స్వనిధి కూడా- స్వాభిమానం కూడా' పక్షం పేరిట కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా వచ్చే నెల 2 వరకు జిల్లాలోని అన్ని పట్టణాల్లో వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు చేయిస్తారు.



● ఆత్మ నిర్భర నిధి పక్షోత్సవం ● ఉమ్మడి జిల్లాలో వీధి వ్యాపారుల గుర్తింపు ● రుణాలకు దరఖాస్తులు

భీమవరం టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో గతంలోనే వీధి వ్యాపారులను గుర్తించి బ్యాంకు రుణాల కోసం దరఖాస్తు చేయించారు. బ్యాంకు అధికారులతో సంప్రదించి వారికి రుణాలు మంజూరు చేయిస్తారు. ఇందు కోసం 4 అంశాలతో మెప్మా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో 13356 మంది వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు చేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ పథకం దేశవ్యాప్తంగా అమలు జరుగుతోంది. ఈ పథకంపై మెప్మా మిషన్ డైరెక్టర్ ఎన్.తేజ్‌భరత్ ఆధ్వర్యంలో అమలుకు చర్యలు చేపడుతున్నారు.

దరఖాస్తులు పెండింగ్

మునిసిపాల్టీల వారీగా ఇప్పటికే బ్యాంకుల్లో రుణాల కోసం వీధి వ్యాపారుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. సంబంధిత బ్యాంకు అధికారులతో మాట్లాడి రుణాలు మంజూరు కు సిబ్బంది కృషి చేస్తారు. రుణాల కోసం వ్యాపారులతో కొత్తగా దరఖాస్తు చేయిస్తారు.

సామాజిక ఆర్థిక ప్రొఫైల్ నమోదు

వీధి వ్యాపారుల ఆర్థిక ప్రొఫైల్‌నమోదు చేస్తారు. కుటుంబ సభ్యుల వివరాలు, వారికి ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర సామాజిక భద్రత పథకాల్లో వారిని నమోదు చేయించి, బీమా తదితర అంశాలపై అవగాహన కల్పిస్తారు. అదేవిధంగా బ్యాంకు ఎల్‌డీఎం, కార్మిక, వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వ్యాపారులకు అవగాహన కల్పిస్తారు.

డిజిటల్ లావాదేవీల పెంపు

వీధి వ్యాపారలతో డిజిటల్ లావాదేవీలు పెంచేలా వారికి క్యూఆర్ కోడ్‌లు జారీ చేయిస్తారు. డిజిటల్ లావాదేవీల నిర్వహణపై అవగాహన కల్పించారు. మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడంలో సూచనలు ఇస్తారు.

పట్టణాల్లో సమావేశాలు

ఈ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు కమిషనర్ల ఆధ్వర్యంలో మెప్మా సిబ్బందికి అధికారులు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. వీధి వ్యాపారులకు ప్రయోజనం చేకూర్చడం పై సూచనలు ఇస్తున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఈ పథకంపై చర్యలు చేపట్టి మునిసిపాల్టీల వారీగా లక్ష్యాలు నిర్దేశించారు.

మునిసిపాలీ	టార్గెట్	ప్రొఫైల్ పెండింగ్	రుణాల పెండింగ్	స్కీమ్స్ పెండింగ్
ఏలూరు	3720	1259	292	957
జంగారెడ్డిగూడెం	1258	384	73	78
నూజివీడు	1250	259	121	492
భీమవరం	2322	881	333	532
తణుకు	1136	321	353	90
తాడేపల్లిగూడెం	1539	335	110	0
పాలకొల్లు	1464	524	425	1747
నరసాపురం	667	193	64	1827
మొత్తం	4156	1771	5723	13356

పోలీసు శాఖలో పదోన్నతి పరీక్షలు


పరీక్షల నిర్వహణ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఐజీ, ఎస్పీ, పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

పెదవేగి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం(డీటీసీ)లో పోలీస్ ఉద్యోగుల పదోన్నతులకు అర్హత పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ. అశోక్‌కుమార్ పరీక్ష ఏర్పాట్లను పరిశీలించారు. రేంజ్ పరిధిలోని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా జిల్లాల సిబ్బందికి పదోన్నతి పరీక్షలు రెండు రోజులపాటు జరుగుతాయని ఆయన తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు 115 మంది పరీక్షలకు హాజరయ్యారని ఆయన తెలిపారు. పటిష్ట భద్రత నడుమ, ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలను నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షల నిర్వహిస్తున్నామన్నారు. పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అధికారుల పర్యవేక్షణలో పరీక్షలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. ఆయన వెంట ఏలూరు ఎస్పీ కె.కిశోర్, పోర్త్ బెటాలియన్ కమాండెంట్ సీవీఏ.రామకృష్ణ, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీటీసీ డీఎస్పీ సీహెచ్‌వీ.ప్రసాదరావు, తూర్పుగోదావరి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వుడ్ ఏఎస్పీ చెంచురెడ్డి, ఏఆర్ ఏఎస్పీ ఎస్ఎస్ఎస్.శేఖర్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, మహిళా ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

పాలకొల్లు ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్

» పనులు వేగవంతం చేయండి

» అధికారులకు మంత్రి నిమ్మల ఆదేశం


ఆస్పత్రి భవన నిర్మాణ వివరాలు తెలుసుకుంటున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ సెంటర్ నెల రోజుల్లో ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలని అధికారులను మంత్రి నిమ్మల రామానాయుడు ఆదేశించారు. వంద పడకల ఆసుపత్రి భవన నిర్మాణ పనులను మంత్రి నిమ్మల సోమవారం పరిశీలించారు. జగన్ ఐదేళ్ల పాలనలో వంద పడకల ఆసుపత్రి భవనం నిర్మాణ పనులు గాలికొదిలేశారని, కూటమి ప్రభుత్వం ఏర్పడగానే నిర్మాణ పనులుపై దృష్టి పెట్టామన్నారు. డయాలసిస్ సెంటర్ లేక పాలకొల్లు పరసర ప్రాంతాల రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుకు హామీ ఇచ్చామన్నారు. రాష్ట్రంలో రెండు డయాలసిస్ సెంటర్లు మంజూరు కాగా ఒకటి ఇక్కడ ఏర్పాటుచేసి ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నామన్నారు. వంద పడకల ఆసుపత్రి కొత్త భవనంలోనే డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి నిమ్మల తెలిపారు. ముందుగా ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆయన ఆరా తీశారు. కూటమి నాయకులు, అధికారులు, వైద్యసిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

క్రైమ్ కార్నర్


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

లారీని ఢీకొన్న కారు

నలుగురికి తీవ్ర గాయాలు

ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ఆగిఉన్న లారీని వెనక నుంచి కారు ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. విజయవాడకు చెందిన సమ్మెట నాగ సత్యనారాయణ, సమ్మెట పద్మజ, సమ్మెట డింపుల్ సాయి శ్రీజ (25), రామశెట్టి నాగ జగదీశ్వరి సోమవారం మచిలీపట్నం నుంచి ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి కారులో వెళుతున్నారు. ఏలూరు సమీపంలోని జాతీయ రహదారిపై లారీని వెనుక నుంచి కారు ఢీకొంది. కారులో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడడంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

ప్రమాదంలో గాయపడి.. చికిత్స పొందుతూ ఒకరి మృతి

పెనుమంట్ర, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పొలమూరు - బ్రాహ్మణచెరువు రహదారి పక్కన కంకర గుట్ట వద్ద ప్రమాదానికి గురై తీవ్ర గాయాలతో చికిత్సపొందుతున్న వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. గణపవరానికి చెందిన జె.దాస్ ఆదివారం రాత్రి మోటార్ సైకిల్‌పై వీరవాసరం వెళుతూ కంకర గుట్టను ఢీకొన్నాడు. తలకు బలమైన గాయం కావడంతో తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆస్పత్రి వర్గాల సమాచారంతో పెనుమంట్ర ఎస్సై స్వామి కేసు నమోదు చేశారు.

రైలు ఢీకొని మహిళ మృతి

ఏలూరు క్రైం/దెందులూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మహిళ రైలు పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందింది. దెందులూరు మండలం సీతంపేటకు చెందిన కాలి కాంతమ్మ (58)కు కొంతకాలం నుంచి మతిస్థిమితం లేదు. సోమవారం ఉదయం బహిర్భూమికి వెళ్లడానికి ఇంటి సమీపంలో పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొనడంతో మృతి చెందింది. రైల్వే ఎస్ఐ పి.సైమన్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

కారు అద్దెకు తీసుకుని.. తాకట్టు పెట్టేస్తారు

» ఇద్దరి అరెస్ట్

» ఆరు కార్లు స్వాధీనం



పోలీసుల అదుపులో నిందితులు

ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్లను అద్దెకు తీసుకుంటారు.. రెండు నెలలు సక్రమంగా అద్దె కట్టేస్తారు. తర్వాత వాటిని గుట్టుచప్పుడు కాకుండా వేరే ప్రాంతంలో తాకట్టు పెట్టేస్తారు. కార్లను అద్దెకు ఇచ్చిన వారిని, తాకట్టు పెట్టుకున్న వారిని తప్పించుకు తిరుగుతారు. బాధితుల ఫిర్యాదుతో ఇద్దరు నిందితులను ఏలూరు త్రీ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ కేసు వివరాలను తెలిపారు. ఏలూరు సత్రంపాడు విద్యావికాస్ వీధికి చెందిన ముంగర అశోక్ తంగెళ్ళమూడిలో నివాసం ఉంటున్నాడు. పత్తేబాదకు చెందిన ఎల్లపు భానుచందర్‌తో కలిసి నెలవారీ అద్దెకు కారు కావాలని డ్రైవర్, ఆయిల్ తామే చూసుకుంటామని నమ్మబలుకుతారు. ఒకటి రెండు నెలలు అద్దె సజావుగా కట్టి తరువాత ఆ కారు వేరే ప్రాంతానికి తీసుకువెళ్లి తాకట్టు పెట్టేస్తారు. తెలిసిన వ్యక్తి ద్వారా తమ కుమారుడు అనారోగ్యంతో ఉన్నాడని అత్యవసరంగా ఆపరేషన్ చేయాలంటూ రూ.15 లక్షల విలువైన కారును ఐదు లక్షలకు తాకట్టు పెడతారు. రికార్డు తరువాత తీసుకువస్తామని వెళ్లిపోతారు. కారు అద్దెకు ఇచ్చిన వారు ఎంత కాలం అడిగినా సమాధానం చెప్పకుండా తప్పించుకు తిరుగుతారు. ఏలూరులో ఆరు కార్లను అద్దెకు తీసుకుని తాకట్టు పెట్టేశారు. బాధితులు ఏలూరు రూరల్, టూటౌన్, త్రీ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో సీఐ ఎస్ కోటేశ్వరరావు, ఎస్ఐలు ప్రసాద్, రాంబాబు, సిబ్బంది బృందంగా ఏర్పడి నిందితులు ముంగర అభిషేక్, ఎల్లపు భానుచందర్‌ను సోమవారం అరెస్టు చేశారు. తాకట్టుపెట్టిన ఆరు కార్లను గుర్తించి వాటిని కూడా స్వాధీనం చేసుకున్నారు. డీఎస్పీ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ ఎవరైనా వాహనాలను తాకట్టు పెట్టుకోవాలంటే కచ్చితంగా యజమాని, ఒరిజినల్ సీ బుక్, అన్ని చూసుకోవాలన్నారు. మధ్యవర్తులు తాకట్టు పెడితే పెట్టుకున్న వారిపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. దొంగ సొత్తులను ఎవరు కొన్నా తాకట్టు పెట్టుకున్నా చర్యలు తప్పవన్నారు. విలేకరుల సమావేశంలో డీఎస్పీతో పాటు త్రీ టౌన్ సీఐ ఎస్ కోటేశ్వరరావు, ఎస్ఐలు కె.ప్రసాద్, రాంబాబు, ఏఎస్ఐ బండారు నాని, కానిస్టేబుల్ నాగరాజు, పలువురు పాల్గొన్నారు.

బైక్, ఆటోలు సునాయాసంగా కొట్టేస్తారు

» ఇద్దరు దొంగలు అరెస్ట్

» వాహనాలు స్వాధీనం


అదుపులో నిందితులు, స్వాధీనం చేసుకున్న వాహనాలు

పాలకోడేరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు, ఆటోలను వారు సునాయాసంగా కొట్టేస్తారు. జిల్లాలో పలుచోట్ల కొట్టేసిన వాహనాలతో పోలీసులకు పట్టుబడ్డారు. వాహనాల దొంగలను సోమవారం అరెస్ట్ చేసి రూ.7,19,000 విలువ చేసే మోటార్ బైక్‌లు, ఆటో స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. గొల్లలకోడేరు గ్రామానికి చెందిన ఈదా ప్రకాశ్, మోగల్లు గ్రామానికి చెందిన రెడ్డి శివ కొంతకాలంగా దొంగతనాలకు పాల్పడుతున్నారు. విస్సాకోడేరులో 2 మోటర్ బైక్‌లు మోగల్లులో 1, భీమవరం మండలం దేగాపురంలో ఆటో, హైదరాబాద్‌లో పల్సర్ బైక్ దొంగిలించి మోగల్లులోని ఒక పొదలో దాచిపెట్టారు. దొంగతనాలపై ఆయా పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. దొంగిలించిన మోటార్ బైక్‌లు, ఆటో స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. భీమవరం రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై మంతెన రవివర్మ ఆధ్వర్యంలో అరెస్టు చేసినట్లు స్టేషన్ రైటర్ నాగరాజు తెలిపారు.

స్కూటర్ డిక్కీలో సొమ్ము కొట్టేశాడు

భీమడోలు, నవంబరు 25: ద్వారకాతిరుమల మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన నందమూరి సత్యనారాయణ బ్యాంక్ ఖాతాలో రూ.2.5లక్షలు సోమవారం డ్రా చేశాడు. స్కూటీ డిక్కీలో ఉంచి భీమడోలులో స్కూటీ షాపు ముందు ఉంచి సరుకుల కొనుగోలుకు వెళ్లాడు. తిరిగి వచ్చేసరికి డిక్కీలో సొమ్ము ఎవరో కొట్టేశారు. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


ప్లాస్టిక్ కవర్లను పరిశీలిస్తున్న అధికారులు

ప్లాస్టిక్ కవర్ల విక్రయం

వ్యాపారులకు రూ.22వేలు జరిమానా

భీమవరంటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్లాస్టిక్ కవర్ల వాడకం నిషేధించారు. ప్రజారోగ్యశాఖ అధికారులు సోమవారం షాపులను ఆకస్మిక తనిఖీ చేసి ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను విక్రయిస్తున్న వ్యాపారులకు రూ22వేల జరిమానా విధించారు. అసిస్టెంట్ కమిషనర్ ఎ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పురపాలక సంఘం పరిధిలో శానిటేషన్ సెక్రటరీలు, ఇన్‌స్పెక్టర్లు షాపులు తనిఖీ చేయాలన్నారు. నిషేదిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలపై నిఘా ఉంచాలన్నారు. ప్రతీరోజు ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట, సాయంత్రం 5.30 నుంచి 7గంటల వరకూ బృందాలుగా వెళ్లి తనిఖీ చేయాలన్నారు. పెనాల్టీలు కట్టడానికి నిరాకరించిన దుకాణాలను సీజ్ చేయాలని స్పష్టం చేశారు. ప్రతీ రోజు విధించిన పెనాల్టీ వివరాలను తెలియజేయిలని ఆదేశించారు.

మార్చురీలో మృతదేహాల మాయంపై నేడు అధికారుల విచారణ

ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి మార్చురీలో అనాథ మృతదేహాల మాయం కావడంపై డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు విచారణకు ఆదేశించారు. అక్టోబర్ 8న రాత్రి మార్చురీ అసిస్టెంట్ అశోక్ ఒక అనాథ మృత దేహాన్ని ఒక అంబులెన్సులో బయటకు తీసుకువెళ్లాడు. డ్యూటీలో ఉన్న మార్చురీ అసిస్టెంట్ గుర్తించి సంబంధిత హెచ్‌వోడీ భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. దీనితో అశోక్ మృతదేహాన్ని వెనక్కు తీసుకువచ్చి అప్పగించాడు. అశోక్ గతంలో 8 మృతదేహాలను తరలించినట్లు ప్రాథమికంగా గుర్తించారు. దీనిపై మెడికల్ కాలేజీ అప్పటి ప్రిన్సిపాల్ డాక్టర్ శశిధర్ విచారణకు ఆదేశించారు. విచారణలో అనాథ మృతదేహాలు మాయం కావడాన్ని నిర్ధారించినట్లు సమాచారం. ఈ నివేదిక డీఎంఈ అధికారులకు చేరడంతో నేరుగా ఇద్దరు వైద్యుల బృందం మంగళవారం ప్రభుత్వ మెడికల్ కాలేజీకి విచారణ నిమిత్తం రానున్నారు. మార్చురీతో సంబంధం ఉన్న పలువురు ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. ఇప్పటికే టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో మార్చురీ అసిస్టెంట్ అశోక్‌పై క్రిమినల్ కేసు నమోదైంది. అతడిని గతంలోనే సస్పెండ్ చేశారు.

మహిళ ఆత్మహత్య

ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం చాటపర్రు గ్రామానికి చెందిన కలగర పూర్ణిమ (30) ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమెకు 13 ఏళ్ల క్రితం అనిల్‌కుమార్‌తో వివాహమైంది. ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఒక థియేటర్ వద్ద ఉన్న క్యాంటీన్‌లో పనిచేసే అనిల్‌కుమార్ అయ్యప్ప దీక్షలో ఉన్నాడు. పూర్ణిమ రెండు రోజుల నుంచి నెలసరి నొప్పితో బాధపడుతోంది. అనిల్‌కుమార్ కొద్ది రోజుల నుంచి పీఠం వద్దే ఉంటున్నాడు. పిల్లలతో ఇంటి వద్ద ఉన్న పూర్ణిమ సోమవారం వేకువజామున ఉరివేసుకుంది. సమాచారం అందడంతో రూరల్ ఎస్ఐ దుర్గాప్రసాద్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆమె నెలసరి నొప్పి బాధభరించలేక ఆత్మహత్య చేసుకుందా లేదా ఆమెకు ఒక స్నేహితుడు ఉన్నాడని, అతడు పట్టించుకోవడం లేదని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య

ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తి పురుగుమందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భీమడోలు మండలం పూళ్ళ గ్రామానికి చెందిన కాసాని రాంబాబు (45) ఐదేళ్ల నుంచి పెదవేగి మండలం బాపిరాజుగూడెంలో ఒక రైతు వద్ద పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం రైతు వద్దకు వెళ్ళి తాను మద్యం తాగాలని డబ్బులు అడిగాడు. తాను పాలు తీస్తున్నానని తరువాత ఇస్తానని రైతు చెప్పడంతో అకస్మాత్తుగా రాంబాబు పురుగు మందుతాగి పడిపోయాడు. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.



సెక్యూరిటీ నిజాయితీ

ద్వారకాతిరుమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ పోగొట్టుకున్న ఓ భక్తునికి తిరిగి దాన్ని అప్పగించి ఓ సెక్యూరిటీ గార్డు తన నిజాయితీ నిరూపించుకున్నాడు. ఉంగుటూరుకు చెందిన ఓ భక్తుడు సోమవారం శ్రీవారి ఆలయానికి వచ్చాడు. కేశఖండన శాలకు వెళ్లి మొక్కులు తీర్చుకుని అక్కడ మొబైల్ మర్చిపోయి దర్శనానికి వెళ్లిపోయాడు. ఫోన్ లేకపోవడంతో కంగారుగా కేశఖండన శాల వద్దకు వెళ్లి సెక్యూరిటీని అడగ్గా భక్తుడు చెప్పిన ఆధారాల ఆధారంగా అతనికి ఫోన్ ఇచ్చేశాడు.

నేడు కిసాన్ మోర్చా మహా ధర్నా

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు మంగళవారం ఏలూరులో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్టు సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు ప్రసాద్, బి.సోమయ్య, ఎస్.కె.బాషా, కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ తెలిపారు.

పిల్లలతో భిక్షాటన చేయిస్తే చర్యలు

ద్వారకాతిరుమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి శేషాచలకొండపై పసిపిల్లలతో భిక్షాటన చేయిస్తున్న మహిళలకు అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. చినవెంకన్న కొండపై చిన్న పిల్లలను ఎత్తుకుని కొందరు, అలాగే బాలలతో కొందరు మహిళలు భిక్షాటన చేయిస్తున్నారన్న సమాచారం అందుకుని మహిళ అభివృద్ధి, సంక్షేమశాఖ, పోలీస్, విద్యాశాఖ, దేవదాయ శాఖల ఆధ్వర్యంలో సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పసిపిల్లలతో భిక్షాటన చేయిస్తున్న తల్లులకు జిల్లా చైల్డ్‌లైన్ 1098 కోఆర్డినేటర్ వెంకటరాజు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళా పోలీస్ లక్ష్మీసుజన తదితరులు వారికి బాలల హక్కులు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. భిక్షాటన చేయిస్తున్న తల్లిదండ్రులు లేదా సంరక్షకులు చట్టరీత్యా నేరస్తులని తెలిపారు. పిల్లలను వారి తల్లులను అవగాహన నిమిత్తం చైల్డ్ హెల్ప్‌లైన్‌కు అప్పగించారు.

నారా రోహిత్‌కు మండల నేతల పరామర్శ

ద్వారకాతిరుమల, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే నారా రామ్మూర్తి నాయుడు మృతి చెందడంతో ఆయన కుమారుడు నారా రోహిత్‌ను మండల టీడీపీ నాయకులు పలువురు పరామర్శించారు. రేగంటి రాంబాబు, మొగతడకల ఓం ప్రకాష్‌చౌదరి, పాతూరి సహృదయ్, యలమంచిలి బాబి తదితరులు నారావారిపల్లిలో రోహిత్‌ను కలసి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సమగ్ర కుల గణన చేయాలి

ఏలూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రాలు జాతీయ స్థాయిలో నిర్వహించ తలపెట్టిన జనగణనతో పాటే సమగ్ర కులగణన చేపట్టి ఆ తరువాత రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు బీమవరపు పాపారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద కులగణన చేపట్టాలని ఆందోళన చేసి అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. నగర అధ్యక్షుడు మారగాని చంద్రకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రజకుల్లో ఐక్యత అవసరం

ఏలూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): హక్కుల సాధనకు, ప్రభుత్వ పథకాలను, వృత్తి సంబంధమైన సమస్యలను పరిష్కరించుకోవడానికి రజకులు ఐక్యంగా ఉండాలని రజక సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకలపల్లి కట్టయ్య కోరారు. సోమవారం సంఘ భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కొన్నిచోట్ల రజకుల చెరువులను శ్మశాన భూములుగా చూపించి రద్దుచేసే ప్రయత్నం చేస్తున్నారని, ఇలాంటి ఘటనలకు పాల్పడితే పోరాటాలకు వెనుకాడమన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.ఏడుకొండలు, ఉపాధ్యక్షుడిగా బి.సత్యనారాయణ, కార్యదర్శిగా కె.శ్రీను, సంయుక్త కార్యదర్శిగా ఎ.రామకృష్ణ, సలహాసభ్యులుగా ఎ.రాము, కె.సత్యనారాయణను ఎన్నికయ్యారు.

విన్నపాలు వినవలె..

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వినతుల వెల్లువ



ఆర్‌డీఓకు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

కుక్కునూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కుక్కునూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణకు కూటమి నాయకులు సమస్యలు విన్నవించారు. అలాగే దాదాపు 190 మంది భూ సమస్యలు ఆర్అండ్ఆర్, పునరావాస పరిహారం తదితర సమస్యలపై అర్జీలు పెట్టుకున్నారు. కాగా టీడీపీ మండల అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు, కోటగిరి సత్యనారాయణ, ఉప సర్పంచ్ పిచ్చుక రాజు, నిర్వాసితుల సమస్యలను ఆర్డీవోకు వివరించారు. స్థానికంగానే ఉంటూ అన్ని ఆధారాలున్నప్పటికి వందలాది మంది నిర్వాసితుల పేర్లు జాబితాలో లేవని అలాగే ఇళ్ల పరిహారంకు సంబంధించి జాబితాలో వందలాది మంది నిర్వాసితుల ఇళ్ళు పేర్లు తొలగించారని తెలిపారు. అలాగే 41.15 కాంటూరులో వేరే గ్రామాలు ముందే ముంపుకు గురవుతున్నాయని వాటిని పరిగణలోకి తీసుకోవాలని వివరించారు. గొమ్ముగూడెం గ్రామస్థుడు బావి కృష్ణమాచార్యులు గత ప్రభుత్వ హయాంలో ఇంటిపరిహారం, వ్యక్తిగత పరిహారం అందించారని తనకు పునరావాస పరిహారం రూ.6.36 లక్షలు తనకు అందలేదని అర్జీ ఇచ్చాడు.

అక్రమ నర్సరీలపై చర్యలకు వినతి

మండలంలో అక్రమంగా నిర్వహిస్తున్న జామాయిల్ నర్సరీల యాజమానులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఉయ్యన శ్రీను సోమవారం ఆర్‌డీఓ ఎంవీ రమణకు వినతిపత్రం అందజేశారు. గిరిజనుల పేరుమీద నర్సరీలు నడుపుతూ అక్ర మ మీటర్లతో విద్యుత్ వినియోగించుకుంటున్నారని అన్నారు.

అధికారులు పంట నాశనం చేస్తున్నారు..

జంగారెడ్డిగూడెం: ప్రభుత్వ మిగులు భూమిలో సాగు చేసుకుంటున్న జీడి మామిడి, పామాయిల్ పంటలను అటవీశాఖ అధికారులు నాశనం చేస్తున్నారని సోమవారం జంగారెడ్డిగూడెం ఆర్డీవో కార్యాలయంలో అల్లంచర్ల రాజుపాలెం పరిసర ప్రాంత రైతులు వినతిపత్రం సమర్పించారు. బాధిత రైతులు మాట్లాడుతూ సుమా రు 600 ఎకరాలకు పైబడి ఉన్న మిగులు భూమిని తాము సాగుచేసుకుంటున్నామని అయితే అటవీ అధికారులు ఆ భూమి తమ దేనంటూ పంటను తొలగిస్తున్నారని తెలిపారు.



కలెక్టర్‌కు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

ఆదరణ పరికరాలేమయ్యాయో తేల్చండి: చింతమనేని

పెదవేగి: 2019కి ముందు అప్పటి టీడీపీ ప్రభుత్వం నాయీ బ్రాహ్మణులు, రజకుల కోసం ఆదరణ పథకంలో పనిముట్లను కొనుగోలు చేసి, లబ్ధిదారులకు పంపిణీ చేయాలని భావించిందని, ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పని ముట్లను పెదవేగి మండలం లక్ష్మీపురంలోని దెందులూరు మార్కెట్ యార్డులో భద్రపరిచామని అవి ఏమయ్యాయో తెలియడం లేదని ఎమ్మెల్యే చింతమనేని కలెక్టర్ కె.వెట్రిసెల్వీకి విన్నవించారు. లబ్ధిదారుల వాటా సొమ్మును చెల్లించారని, కానీ పరికరాలు మాత్రం వారికి చేరలేదని తెలిపారు. అలాగే తూర్పుగోదావరి జిల్లా తాడిపూడి సమీపంలోని గోదావరి నది ఒడ్డున ఇసుక క్వారీ కేటాయిస్తే ఏలూరు జిల్లా ప్రాంతవాసులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు.

ఎన్నికల డ్యూటీ సర్టిఫికెట్ల జారీకి అభ్యర్థన

ఏలూరు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు ముగిసి ఆరునెలలు గడిచినప్పటికీ జిల్లాలో ఎన్నికల విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు ఇంత వరకు జారీ చేయలేదని, వెంటనే వాటిని అందజేసేందుకు సంబంధిత నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు సూచనలివ్వాలని అభ్యర్థిస్తూ డీఆర్వోకు పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు అంజనేయులు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు.

సత్యవతమ్మకు ఘన నివాళి



కామవరపుకోట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జీలకర్రగూడెం జమీందారు దివంగత శ్రీ రాజా రాఘవరాజు సుబ్బరాజు సతీమణి సత్యవతమ్మ ఈ నెల 15న మృతి చెందగా సోమవారం జీలకర్రగూడెంలోని జమిందారు నివాస గృహంలో వారి కుమారులు రాజా రాఘవరాజు వెంక ట్రాజు, రంగరాజు, వీర రామకృష్ణంరాజు, ఎర్రం రాజు, వెంకట రామకృష్ణంరాజు, నారాయణ రాజు పెద్ద కార్యం నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్య క్షులు చవటపల్లి విక్రమ్‌కిషోర్, మహిళా మోర్చ రాష్ట్ర అధ్యక్షురాలు బొల్లిన నిర్మలకుమారి, జిల్లా ఉపాధ్యక్షులు పి.వి.రామలక్ష్మి, చింతలపూడి అసెంబ్లీ కన్వీనర్ యేసువరప్రసాద్, కిసాన్‌మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నారాయణరాజు తదితరులు సత్యవతమ్మకు నివా ళులర్పించారు.

టీడీపీలో కష్టపడితే ప్రతిఫలం

ఏలూరు టూటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడిన ప్రతీ కార్యకర్తకు తగిన ప్రతిఫలం లభిస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏపీ మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన టీడీపీ రాష్ట్రకార్యదర్శి దాసరి ఆంజనేయులు మర్యాదపూర్వకంగా ఎమ్మెల్యే చంటిని కలిశారు. ఆంజనేయులు మాట్లాడుతూ తనకి పదవి రావడానికి సహకరించి ఎమ్మెల్యే చంటికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉత్సాహంగా చెస్ పోటీలు

ఏలూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): చదరంగంతో మేధాశక్తి పెంపొందుతుందని సెయింట్ జోసఫ్ డెంటల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.భద్రి అన్నారు. శనివారపుపేట అబ్రహం గ్యారీ కాస్ట్రో చెస్ అకాడమి ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా అండర్ -15 చెస్ పోటీలు జరిగాయి. జి.అభిషేక్ అవరహం ప్రథమ, జి.అనురూప్ మోషే ద్వితీయ, ఎస్.విహాన తృతీయ, కె.శ్రీజ 4వ స్థానం, ఎస్.భవ్యశ్రీ 5వ స్థానం సాధించగా, కె.ఆయాన్, సిహెచ్ పార్థవ కృష్ణ, ఏ.అశ్విన్, కార్తికేయ, ఎం.గగన్, సాత్విక, సిహెచ్ మేఘశ్రీ, ఎం.చంద్రికలు కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు.

తన్మయ్‌కు ప్రథమ స్థానం

జంగారెడ్డిగూడెం: తిరుపతి జిల్లా గూడూరులో జరిగిన రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో అండర్-16 బాలికల విభాగంలో పట్టణానికి చెందిన మేడిచర్ల తన్మయ్ ప్రథమస్థానం పొందినట్లు దివ్యాస్ మాస్టర్స్ చెస్ అకాడమి డైరెక్టర్ అండ్ కోచ్ ఐనపర్తి సరళామాధవి తెలిపారు. ఈ సందర్భంగా తన్మయ్‌ని పలువురు అభినందించారు.

జూడోలో వట్లూరు విద్యార్థినుల ప్రతిభ

పెదపాడు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇటీవల తిరుపతిలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అంతర్‌జిల్లా జూడో ఛాంపియన్‌షిప్ అండర్ -19 విభాగంలో వట్లూరు డాక్టరు బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థినులు రెండు వెండి, రెండు కాంశ్య పతకాలను సాధించినట్లుగా కళాశాల ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీరాణి తెలిపారు. కళాశాలలో జరిగిన కార్యక్రమంలో క్రీడాకారిణులు ఎస్.సన్ని, టి.రంజని, ఎస్.అఖిల, జి.సుష్మలను ప్రిన్సిపాల్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయురాలు టి.సునీల కుమారి, జి.భవానీ అభినందించారు.

ఉచిత వైద్య శిబిరాలు వినియోగించుకోవాలి

పెదపాడు, నవంబరు 25 : గ్రామాల్లో దాతలు ఏర్పాటు చేసే ఉచిత వైద్యశిబిరాలను వినియోగించుకోవాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. అప్పనవీడులో మొవ్వా రాఘవరావు జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.

మాజీ సర్పంచ్ ఎంబిస్వామి మృతి

ఉంగుటూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రావులపర్రు మాజీ సర్పంచ్ తాడిశెట్టి ఎంబిస్వామి ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థి గైర్హాజరు కారణం టీచర్‌కు తెలియాలి

సెలవుల పరిమితిపై టీచర్లకు నచ్చజెప్పాల్సిన బాధ్యత విద్యాధికారులదే : కలెక్టర్

ఏలూరు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : స్కూలుకు విద్యార్థులు గైర్హాజరైతే తగిన కారణాన్ని తెలుసుకుని క్లాసు టీచరు తనవద్ద వివరాలను ఉంచుకోవాలని, తాము అడిగినపుడు ఆ వివరాలను చెప్పాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ఉపాధ్యాయులకు పదిశాతం సెలవుల పరిమితికి తన ఆదేశాలే కారణమని విద్యాశాఖ అధికారులు ప్రచారం చేయడంపై అసహనం వ్యక్తంచేస్తూ స్కూలు, విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా బోధనకు విఘాతం కలగకూడదన్న విషయాన్ని టీచర్లకు తెలియ జేయాల్సిన బాధ్యత విద్యాధికారులదేనని స్పష్టం చేశారు. పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఉపాధ్యాయులు త్యాగం చేయాలని కోరారు. ఇంటర్మీడియట్, ఎఫ్ఏ-1, 2 పరీక్షల ఫలితాలు, అపార్ నమోదుపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. 'అపార్' నమోదులో వెనుకబడిన నూజివీడు, జీలుగుమిల్లి, చింతలపూడి ఎంఈవోల పనితీరుపై అసహనం వ్యక్తంచేశారు. తక్షణమే బ్యాక్‌లాగ్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. నిర్దేశిత లక్ష్యంమేరకు అపార్ డేటా నమోదుకు ఆటంకంగా ఉన్న ఆధార్ వివరాల సవరణలకు మొత్తం 45 కేంద్రాలను ఏర్పాటు చేశామని వివరించారు. పుట్టినతేదీల్లో తప్పులు దొర్లితే వాటిని సరిచేసేలా ఆర్డీవోలకు ఆదేశాలు ఇచ్చామన్నారు. ఇంటర్మీడియట్, పదో తరగతి త్రైమాసిక పరీక్షల ఫలితాలనుబట్టి వార్షిక పరీక్షల్లో ఎక్కువ ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటర్‌లో ఉత్తీర్ణత సరిగా రావడంలేదని, కార్యాచరణ ప్రణాళికను అమలుచేయాలని ఆదేశించారు. ఆర్డీవోలు అచ్యుత అంబరీష్, రమణ, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో విజయరాజు, డీవీఈవో ప్రభాకరరావు, ఆర్ఐవో చంద్రశేఖరబాబు, డీఈవో కార్యాలయ ఏడీ-2 షరీఫ్, ఎంఈవోలు పాల్గొన్నారు.

చినవెంకన్నను దర్శించుకున్న మాజీ మంత్రి దేవినేని



ద్వారకాతిరుమల: చినవెంకన్న ఆలయాన్ని మాజీ మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు సోమవారం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం ఆయనకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందించారు.

హామీలను నెరవేరుస్తాం : బడేటి చంటి

ఏలూరు టూ టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ప్రజల నుంచి వినతులు స్వీకరించి మాట్లాడుతూ నగరంలో గుంతలరోడ్డులన్నిటిని పూడ్చే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కోడిగూడెంలో అంగన్వాడీ కేంద్రం శిథిలావస్థలో ఉండటాన్ని చూసి కొత్త భవనం నిర్మించేవరకూ సంబంధిత అధికారులతో మాట్లాడి ఎంపీపీ పాఠశాల ఆవరణలోకి మార్చాలని ఆదేశించారు.

టీడీపీ సభ్యత్వంతో ఆర్థిక భరోసా : రోషన్

జంగారెడ్డిగూడెం: స్థానిక డాంగేనగర్‌లో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని తీసుకోవడం వల్ల రూ.5 లక్షల ప్రమాద బీమా, రూ.2 లక్షలు సాధారణ మరణానికి పరిహారం అందజేస్తున్నట్లు తెలిపా రు. అనంతరం శ్రీనివాసపురంలో ఇటీ వల విద్యుదాఘాతంతో మరణించిన తగరం కల్యాణ్ కుటుంబాన్ని, గుండె జబ్బుతో చనిపోయిన పోల్నాటి రామకృష్ణ కుటుంబాన్ని పరామర్శించారు.

రహదారుల నిర్మాణంలో నాణ్యత పాటించాలి : మద్దిపాటి

ద్వారకాతిరుమల: గ్రామీణ రహదారుల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుంటే ఉపేక్షించేది లేదని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు హెచ్చరించారు. మండలంలో ఆయన నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లను పరిశీలించారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో బాధితులకు రూ.4.76 లక్షల విలువైన

గుంతలు లేని రహదారుల నిర్మాణమే లక్ష్యం : బాలరాజు

జీలుగుమిల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలవరం నియోజవకర్గంలో గుంతలు లేని రహదారుల నిర్మాణమే లక్ష్యంగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. జీలుగుమిల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రూ.23కోట్ల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నియోజవకర్గంలో సీసీ రోడ్లు నిర్మాణం చేపట్టామన్నారు. కొయ్యలగూడెంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంజూరు అయ్యిందని 5ఎకరాలు స్థలం స్థానికులు గుర్తిసే డిగ్రీ కళాశాల నిర్మాణం జరుగుతుందన్నారు. దీంతోపాటు ఫైర్ స్టేషన్ మంజూరయ్యిందన్నారు.

క్రీడలతో సన్మార్గం : చింతమనేని

పెదవేగి: క్రీడలు యువతను సన్మార్గంలో నిలుపుతాయని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం నడిపల్లిలో జనసేన ఆధ్వర్యంలో వచ్చే నెల 6 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్న జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల పోస్టర్‌ను జనసేన రాష్ట్ర కార్యదర్శి ఘంటసాల వెంకటలక్ష్మి, ఇతర నాయకులతో కలిసి ఎమ్మెల్యే సోమవారం ఆవిష్కరించారు.

'ఆ టీచరుంటే స్కూల్‌కు వెళ్లం'

ద్వారకాతిరుమల, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల ఎంపీయూపీ పాఠశాలలో లెక్కల టీచర్ తీరుపై విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు. విద్యార్థుల తల్లితండ్రులు సోమవారం ద్వారకాతిరుమల వచ్చిన ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు వద్ద మొరపెట్టుకున్నారు. సోమవారం పిల్లలను కొట్టినట్లు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందించి టీచరును మంగళవారం తన క్యాంపు కార్యాలయానికి వచ్చేలా చూడాలని స్థానిక నాయకులను ఆదేశించారు.

పెదవేగి ఎంఈవో -1గా ప్రసాద్

పెదవేగి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెదవేగి ఎంఈవో -1 గా ఏవీఎస్‌వీ ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దెందులూరు ఎంఈవో- 1గా పనిచేస్తున్న ఆయన పెద వేగి ఎంఈవో- 1గా అదనపు బాధ్యతలు స్వీకరించారు.

హామీలు అమలు చేయాలి

బుట్టాయగూడెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం రెడ్డి గణపవరంలోని గ్రామ సచివాలయం ఎదుట బీసీలు కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ 50 ఏళ్లు దాటిన ఎస్సీ, బీసీలకు పింఛన్లు ఇస్తామని సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. అనంతరం వెల్ఫేర్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేశారు.

వీఆర్వోల నూతన కమిటీ

ఏలూరు రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏలూరు అర్బన్ మండల, వీఆర్వోల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండలాధ్యక్షుడిగా అజయ్‌బాబు, సహాధ్యక్షుడిగా నారా తారకేష్, కార్యదర్శిగా పి.జాన్‌సుధాకర్, సహాయ కార్యదర్శులుగా ప్రమీల, నేతల జోత్స్న, కోశాధికారిగా ఎస్.సింహాద్రిలను ఎన్నుకున్నారు. అనంతరం నూతనకమిటీ సభ్యులు ఏలూరు అర్బన్ తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. జిల్లా అధ్యక్షుడు చంద్రమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షాన పోరాటాలు

బుట్టాయగూడెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరిగేంత వరకు సీపీఐ పేదల పక్షాన పోరాటాలు చేస్తూనే ఉంటుందని జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. సోమవారం బుట్టాయగూడెంలో మండల నాయకుడు బేతి కిషోర్ అధ్యక్షతన జరిగిన మండల స్థాయి సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు.

కలెక్టర్ ఆదేశాలతో.. ప్రభుత్వ ఆసుపత్రిలో ఫాగింగ్

ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా ఏలూరు ప్రభుత్వాసుపత్రిని పరిశీలించారు. దోమలు ఎక్కువగా ఉన్నట్లుగా కలెక్టర్‌కు పలువురు ఫిర్యాదు చేయడంతో తక్షణ చర్యలు తీసుకో వాలని ఆసుపత్రి మెడికల్ సూపరిటెండెంట్‌ను ఆదేశించారు. మరో వైపు మున్సిపల్ అధికారులను కూడా ఆదేశించారు. దీంతో సోమవారం సాయం త్రం ఏలూరు నగర మున్సిపల్ కార్పొరేషన్‌కు చెందిన సిబ్బంది ఆసుపత్రిలో మలాథియాన్ ఫాగింగ్ చేశారు. మొత్తం మీద కలెక్టర్ ఆదేశాలతో ఆసుపత్రిలోని రోగులు హర్షం వ్యక్తం చేశారు.

సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు పోస్ట్ చేయవద్దు

ఏలూరు అర్బన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మహిళా హింస నిరోధక దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా పోలీసుస్టేషన్ ఎస్సై కాంతిప్రియ మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల్లో అమ్మాయిలు తమ ఫోటోలను పోస్ట్ చేసి అనవసర సమస్యలను కొనితెచ్చుకోవద్దని సూచించారు. మహిళలపై హింస, వాటి నిరోధంపై వివరించారు. ప్రిన్సిపాల్ గిరిబాబు, వైస్ ప్రిన్సిపాల్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మవద్దు

బుట్టాయగూడెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): వరి రైతులు పంట అమ్మకాల సమయంలో దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని తహసీల్దార్ వీవీ చలపతిరావు అన్నారు. సోమవారం బుట్టాయగూడెం రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలుపై జరిగిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మండలంలో రెడ్డిగణపవరం, జైనవారిగూడెం, బుట్టాయగూడెం, విప్పలపాడు, నూతిరామన్నపాలెం కేంద్రాల ద్వారా ధాన్యం కొంటామని 28 వేల గోనె సంచులు అందుబాటులో ఉన్నాయన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఏవో ముత్యాలరావు పాల్గొన్నారు.

జీతాలు పెంచాలని ఆందోళన

పెదవేగి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం ఒంగూరులోని గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ లిమిటెడ్ (లిక్కర్ ఫ్యాక్టరీ) కార్మికులు జీతాలు పెంచాలని కోరుతూ సోమవారం ఆందోళనకు దిగారు. గౌతమీ ఆగ్రో ఇండస్ట్రీస్ కార్మికులు, యాజమాన్యంకు మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం రెండునెలల కిందట జీతాలను పెంచాల్సి ఉందని, కానీ ఇప్పటివరకు జీతాల పెంపు ఊసే ఎత్తడంలేదని కార్మికసంఘం అధ్యక్షురాలు బెజవాడ పద్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా కార్మికుల ఆందోళనతో స్పందించిన యాజమాన్యం ప్రతినిధి నాగేశ్వరరావు కార్మికులతో మాట్లాడి, జీతాల పెంపుపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిపై ఆందోళన విరమించిన కార్మికులు మంగళవారం ఉదయానికల్లా జీతాల పెంపుపై నిర్దిష్ట ప్రకటన చేయకపోతే మంగళవారం నుంచి నిరవధిక ఆందోళన తప్పదని హెచ్చరించారు.

బెల్టు షాపుపై కేసు నమోదు

చింతలపూడి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : చింతలపూడి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఈస్ట్‌యడవల్లి గ్రామంలో దాడి చేయగా మరీదు శ్రీనివాస్ అనే వ్యక్తి నుండి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతనిపై బెల్టు షాపు కేసు నమోదు చేసినట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్ తెలిపారు.

శివోహం

భక్తిశ్రద్ధలతో భోళా శంకరుడికి కార్తీక సోమవారం పూజలు



అంబికేశ్వరస్వామికి అంబికా కృష్ణ దంపతుల పంచామృతాభిషేకం



ద్వారకాతిరుమలలో శివయ్యకు స్వయంగా అభిషేకాలు చేస్తున్న భక్తులు



ఏలూరు అశోకనగర్ గవర్లవారి వీధిలో గౌరీ పరమేశ్వర స్వామి ఆలయం వద్ద దీపారాధనలు



చందనాభిషేకం అనంతరం దర్శనమిస్తున్న రేవు లింగేశ్వరస్వామి



భీమడోలులో పూజలందుకున్న పార్వతీ సమేత భీమేశ్వరస్వామి

ఏలూరు కార్పొరేషన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసం ఆఖరి సోమవారం కావడంతో నగరంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. సత్యనారాయణపేటలోని గంగా పార్వతీ సమేత రేవులింగేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారికి చందనాభిషేకాన్ని నిర్వహించి ఏకవార రుద్రాభిషేకాన్ని జరిపారు. పత్తేబాదలోని చౌడేశ్వరి రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద, దక్షిణపువీధిలోని జరాపహరేశ్వరస్వామి, మార్కండేయస్వామి, అగ్రహారంలోని నగరేశ్వరస్వామి, పాత శివాలయం, పవరుపేట, బావిశెట్టివారిపేట, నాగేశ్వరపురంలలోని కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాలు, ఆదివారపుపేటలోని రామలింగేశ్వర స్వామి ఆలయం, శివనగర్‌లోని భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయం వద్ద, మినీ బైపాస్ రోడ్డులోని భవాని సమేత విశ్వంబరేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు పూజలు చేశారు. అంబికాదేవి ఆలయ ప్రాంగణంలోని శ్రీ అంబికేశ్వరస్వామికి మాజీ ఎమ్మెల్యే అంబికా కృష్ణ దంపతులు పంచామృతాభిషేకం, బిల్వార్చన నిర్వహించారు.

పోలవరం: పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. పలు ప్రాంతాల నుంచి సుమారు ఐదువేల మంది స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. తెల్లవారుజామునే పట్టిసీమ ఫెర్రీ రేవుకి చేరుకున్న భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించి దీపాలను నదిలో వదిలిపెట్టారు. ఆలయ ప్రాంగణంలో కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు, ట్రస్టీ కొచ్చర్లకోట వీరభద్రరావులు అన్నదాన కార్యక్రమం స్వయంగా నిర్వహించారు. మండలంలో గుంజవరం ఉమా సహిత భోగలింగేశ్వరస్వామి, పోలవరం ప్రాజెక్టు ఉమా సహిత మహానందీశ్వరస్వామి, రామయ్య పేట పునరావాస కాలనీ శివాలయం, పోలవరం వాసవీ సమేత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

నిడమర్రు: కార్తీక సోమవారంతో పాటు ఏకాదశి సందర్భముగా ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. పెదనిండ్రకొలను భీమేశ్వర స్వామి, నిడమర్రు కేశవస్వామి, భువ్వనపల్లి ఉమామార్కండేయ స్వామి ఆలయాల్లో భక్తులు పూజలు చేశారు. మందలపర్రు ఉమా నీలకంఠేశ్వర పంచాయతన క్షేత్రంలో ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన వైభవంగా నిర్వహించారు. సాయంత్రం గోదావరి హారతి నిర్వహించారు. ఆలయ ధర్మకర్త నరిపల్లె శంకరం, కమిటీ సభ్యులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అఖండ అన్నసమారాధన జరిగింది.

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతున్న శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయం కార్తీకమాసంలో ఆఖరి సోమవారం పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ముందుగా ఆలయాన్ని, పుష్పమాలికలు, మామిడి తోరణాలతో నయనానందకరంగా అలంకరించారు. గర్భాలయంలో స్వామివారికి అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లోని శివలింగానికి భక్తులు స్వయంగా అర్చన, అభిషేకాది కార్యక్రమాలు జరిపారు. భక్తులు ఆలయ ఆవరణలోని ఉసిరి చెట్ల వద్ద కార్తీక దీపాలను వెలిగించారు.

టి.నరసాపురం: టి.నరసాపురంలోని అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీ విశ్వేశ్వరస్వామి వారి ఆలయం, మక్కినవారిగూడెం, మల్లుకుంట గ్రామాల్లోని శివాలయంలో స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసమారాధన జరిగింది.

పెదవేగి: పెదవేగిలోని శ్రీపార్వతీ పరమేశ్వరస్వామివారి ఆలయానికి భక్తుల విశేషసంఖ్యలో హాజరై స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలోని ఉసిరి, మారేడు చెట్లకింద భక్తులు దీపాలను వెలిగించి, భక్తితో పూజలు నిర్వహించారు.

భీమడోలు: భీమడోలులోని భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారు జాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సామూహిక వ్రతాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పోలసానపల్లి శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం, గుండుగొలనులో వేంచేసిన భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చిగురిస్తున్న ఆశలు

తణుకులో 30 పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణానికి అడుగులు
అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆరిమిల్లి ప్రస్తావన
గతంలోనే ప్రతిపాదనలు
వేల్పూరులో స్థలం కేటాయింపు
వైసీపీ ప్రభుత్వం రాకతో మూలకు..

తణుకు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : తణుకు ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణంపై కార్మికులుకు ఆశలు చిగురిస్తున్నాయి. ఏళ్ళ తరబడి సొంత భవనం, కనీస సౌకర్యాలు లేక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్మికులు సమస్యలపై ఇటీవల అసెంబ్లీలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రస్తావించారు. ఆసుపత్రి నిర్మాణం గురించి మాట్లాడారు. గతంలోనే 30 పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం ప్రతిపాదన చేశారు. గతంలో చంద్రబాబు సీఎంగా ఉన్నపుడు వేల్పూరులోని బైపాస్ రోడ్డు సమీపంలో 1.14 సెంట్లు భూమిని ఆసుపత్రి నిర్మాణం కోసం కేటాయించారు. ఈఎస్ఐ ఉన్నతాధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో ప్రతిపాదన అటకెక్కింది. కూటమి ప్రభుత్వంలో ఆసుపత్రి నిర్మాణం జరిగితే కార్మికుల కల తీరినట్టే..

30 వేల వరకు కార్మికులు

పారిశ్రామికంగా ఎంతో అభివృద్ధి చెందిన తణుకులో ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రి పరిధిలో 20 వేల కార్మికులు నమోదై ఉన్నారు. వారితో పాటు కుటుంబ సభ్యులు కలసి మరో పదివేలు ఉంటారు. తణుకుతో పాటు తాడేపల్లిగూడెం, పాలకొల్లు, భీమవరం, వేంద్ర పరిశ్రమలతో పాటు చుట్టు పక్కల స్పిన్నింగ్, స్ట్రా బోర్డు, పేపరు బోర్డు పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడ పనిచేసే కార్మికలు తణుకు ఆసుపత్రికే వస్తారు. వీరికి అవసరమైన చికిత్సల కోసం రాజమండ్రి లేదా విజయవాడ వెళ్లాల్సివస్తోంది.

అరకొర సేవలే

ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిలో ఉండాల్సిన వైద్యులు, సిబ్బంది, మందులు వంటివి కూడా పూర్తి స్థాయిలో లేవు. కనీసం సుగర్ పరీక్షలు కూడా చేయలేని దుస్థితిలో ఉంది. అనేక సంవత్సరాలుగా మహిళా వైద్యులు లేరు. రక్త పరీక్షలకు అవసరమైన కిట్లు అందుబాటులో ఉండటం లేదు. ఇన్సులిన్ సూదులు, టీటీ ఇంజక్షన్‌లు ఉండవు, ఎక్స్‌రే, ఈసీజీ అంటే బయట తీసుకోవాలి. సుగర్ పరీక్షలు చేయడం లేదు. మందులు కూడా సరైనవి ఇవ్వడం లేదని కార్మికులు చెబుతున్నారు. ఆసుపత్రికి వెళ్ళినపుడు ఆన్‌లైన్‌లో కార్మికుడి పేరు ఒకసారి కనిపిస్తే మరో సారి కనిపించదు. దీంతో ఎంతోదూరం నుంచి వచ్చిన కార్మికులు తీవ్ర నిరాశతో వెనుతిరిగి వెళ్ళాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. కనీసం ఇలాంటి సాంకేతిక సమస్యలు కూడా పరిష్కరించడం లేదు.

సిబ్బంది కొరత

డిస్పెన్సరీలో 14 మంది సిబ్బంది ఉండాల్సి ఉంది. కానీ ఏడుగురు మాత్రమే ఉన్నారు. మరో ఏడు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ముఖ్యంగా ఇద్దరు వైద్యులు ఉండాలి. ఒక వైద్యుడు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. మరో వైద్యుడు రాజమహేంద్రవరం నుంచి వారానికి మూడు సార్లు వచ్చి సేవలందిస్తారు. అవుట్ సోర్సింగ్ విధానంలో ఇద్దరు నర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. మిగిలిన పోస్టులు భర్తీ అవుతాయో లేదా అనేది ప్రశ్నార్థకంగా మారిందికూ

ప్రక్షాళన చేయాలి



డిస్పెన్సరీలో అన్ని రకాల పరీక్షలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యురాలిని నియమించాలి. ఆసుపత్రి ప్రాంతంలో కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి. మందులు ఎపుడు ఒకే కంపెనీకి చెందినవి ఇవ్వాలి. ప్రతి మూడు నెలలకు మందులు మార్చడం వల్ల కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలి.

పీవీ ప్రతాప్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

సమయాలు మార్చాలి





కార్మికులకు ఆరోగ్యం బాగాలేకున్న కావా ల్సిన సెలవులు మంజూరు చేయడం లేదు. బయట రక్తపరీక్షలు తీసుకొస్తే ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని చెబుతున్నారు. అనారోగ్యంతో వచ్చిన కార్మికులు ఇబ్బందులు తప్పడం లేదు. పని వేళల్లో మార్పులు తీసుకురావాలి. గతంలో ఉన్నట్టు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు, తర్వాత 4 గంటల నుంచి సాయంత్రం 6 వరకు పనిచేయాలి.

ఆదినారాయణ, సీఐటీయూ మండల అధ్యక్షుడు, గుబ్బల గోపి, కార్యదర్శి

ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు

ఆరిమిల్లి రాధాకృష్ణ, ఎమ్మెల్యే



తణుకులో ముప్పయి పడకల ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం కోసం అన్ని రకాలుగా కృషి చేస్తున్నాను. గతంలో కార్మికులు అవసరాన్ని దృష్టిలో పెట్టుకుని వేల్పూరులో స్థలం కేటాయించాం. తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఇప్పుడు గాడిలో పెట్టే ప్రయత్నం చేస్తున్నాను. దశలవారీగా ఆసు పత్రిలో అన్ని సేవలు అందించేలా చర్యలు తీసుకుంటాం. కార్మికుల శ్రేయస్సు కోసం అన్ని చర్యలు తీసుకుంటాం.

ఏలూరు మీదుగా శబరిమలకు రైళ్లు



ఏలూరు క్రైం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పస్వామి భక్తుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేకంగా విశాఖపట్నం, శ్రీకాకుళం నుంచి శబరిమలై ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు విజయవాడ డివిజన్ అధికారులు సోమవారం తెలిపారు. విశాఖపట్నం - కొల్లాం (రైల్‌నెంబర్ 08539) డిసెంబర్ 4న విశాఖలో ఉదయం 8.20 గంటలకు బయలుదేరి 5న 12.55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ రైలును 2025 ఫిబ్రవరి 26 వరకూ నడపనున్నారు. విశాఖపట్నం - కొల్లాం (08540) రైలు కొల్లాంలో డిసెంబర్ 5న కొల్లాంలో రాత్రి 7.35 గంటలకు బయలుదేరి మరుసటి రోజు అర్ధరాత్రి 11.20 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ రైలును డిసెంబర్ 5 నుంచి 2025 ఫిబ్రవరి 27 వరకూ నడపనున్నారు. శ్రీకాకుళం రోడ్డు - కొల్లాం (08553) రైలు శ్రీకాకుళం రోడ్డులో డిసెంబర్ 1న ఉదయం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు మధ్యాహ్నం 2 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. ఈ రైలును డిసెంబర్ 1 నుంచి 2025 జనవరి 26 వరకూ నడపనున్నారు. కొల్లాం - శ్రీకాకుళం రోడ్డు (08554) రైలు డిసెంబర్ 2న కొల్లాంలో సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి 4న అర్ధరాత్రి 2.30 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకుంటుంది. ఈ రైలును డిసెంబర్ 2 నుంచి జనవరి 27 వరకూ నడపనున్నారు. విశాఖపట్నం - కొల్లాం - విశాఖపట్నం నడిచే రైళ్లు దువ్వాడ, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణికుంట, కాట్పాడి, జాలర్‌పెట్టయ్, సేలం, ఈరోడ్, తిరుపూర్, పొదనూర్, పాల్కాట్, తిరుచూర్, ఆల్వా, ఎర్నాకుళంరోడ్డు, కొట్టాయం, చత్రగంజి, తిరువెళ్ళ, చెంగనూర్, మేవలికెర, కాయంకులం స్టేషన్లలో ఆగనున్నాయి. శ్రీకాకుళం రోడ్డు - కొల్లాం - శ్రీకాకుళం రోడ్డు రైళ్లు పొందూరు, చీపురుపల్లి, విజయనగరం, కొత్తవలస, పెందుర్తి, దువ్వాడ, అనకాపల్లి, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు. గూడూరు, రేణికుంట, కాట్పాడి, జాలర్‌పెట్టయ్, శాలం, ఈరోడ్, తిరుపూర్, పొదనూర్, పాల్కాట్, తిరుచూర్, ఆల్వా, ఎట్టుమనూర్, ఎర్నాకుళం టౌన్, కొట్టాయం, చత్రగంజి, తిరువెళ్ళ, చెంగనూర్, మేవలికెర, కాయంకులం స్టేషన్లలో ఆగనున్నాయి. ఈ రైళ్లలో టూటైర్ ఏసీ, త్రీ టైర్ ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లు ఉంటాయని రైల్వే అధికారులు తెలిపారు.

పోలీసు శాఖలో పదోన్నతి పరీక్షలు

పెదవేగి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రం(డీటీసీ)లో పోలీస్ ఉద్యోగుల పదోన్నతులకు అర్హత పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ. అశోక్‌కుమార్ పరీక్ష ఏర్పాట్లను పరిశీలించారు. రేంజ్ పరిధిలోని ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలు, ఉమ్మడి కృష్ణా జిల్లాల సిబ్బందికి పదోన్నతి పరీక్షలు రెండు రోజులపాటు జరుగుతాయని ఆయన తెలిపారు. హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలు 115 మంది పరీక్షలకు హాజర య్యారని తెలిపారు. పటిష్ట భద్రత నడుమ, ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్షలను నిర్వహిస్తున్నామని ఆయన చెప్పారు. జంబ్లింగ్ విధానంలో పరీక్షల నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం, సాయంత్రం రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు.



పర్యవేక్షిస్తున్న ఐజీ, ఎస్పీ,

ఆయన వెంట ఏలూరు ఎస్పీ కె.కి శోర్, పోర్త్ బెటాలియన్ కమాండెంట్ సీవీఏ.రా మకృష్ణ, ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, డీటీసీ డీఎస్పీ సీహెచ్‌వీ.ప్రసాదరావు, తూర్పు గోదావరి జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వుడ్ ఏఎస్పీ చెంచు రెడ్డి, ఏఆర్ ఏఎస్పీ ఎన్ఎస్ఎస్.శేఖర్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, మహిళా ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో బలివే రామలింగేశ్వరస్వామి, జనార్థనవరం, తుమ్మగూడెం శివాలయాల్లో లక్ష దీపోత్సవం

భక్తులతో పోటెత్తిన శివాలయాలు

ముసునూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం ఆఖరి సోమవారం శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. బలివే రామలింగేశ్వర స్వామికి తెల్లవారుజామున నుంచి ఆలయ అర్చకులు తోలేటి అరుణ భాస్కరరావు ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేక అలంకరించి పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని, కార్తీక దీపాలను వెలిగించి, బాహ్య శివలింగం వద్ద పూజలు చేశారు. ఆలయ ఈవో పామర్తి సీతారామయ్య పర్యవేక్షణలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. గోపవరంలో అన్నపూర్ణ సహిత కాశీవిశ్వేశ్వర స్వామి, నాగేంద్రస్వామి ఆలయాలు, చింతలవల్లిలో పార్వతి సమేత రామలింగేశ్వరుడి ఆలయం, చెక్కపల్లిలో గంగా పార్వతి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, గుడిపాడులో శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేసి, కార్తీక దీపాలను వెలిగించారు.

కార్తీక దీపాల వెలుగులు

చాట్రాయి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాట్రాయి, జనార్ధనవరం, తుమ్మగూడెం, గుడిపాడు శివాలయాల్లో లక్ష దీపోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో శివాలయాలకు కార్తీక దీపాలు వెలిగించి పూజలు చేశారు ఆలయ కమిటీలు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ఎన్‌ఆర్‌ఐ సహకారంతో ఇద్దరికి కృత్రిమ కాళ్లు

ఆగిరిపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఇంగ్లాండ్‌లో ఉంటున్న ఎన్‌ఆర్‌ఐ శివరాత్రి వీరాంజనేయులు కుమారుడు యశ్వంత్ జన్మదినం సందర్భంగా ఇద్దరు దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు అందజేశారు. గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన కలవకొల్లు బిక్షాలరావు, ఏలూరు జిల్లా నూజివీడుకు చెందిన వంకదారు ఉమామహేశ్వరరావుకు హీల్ సంస్థ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ విజయ్ నున్న సోమవారం అందజేశారు. హైటెక్ కృత్రిమ కాళ్ళు మరింత సౌకర్యంగాను, దీర్ఘకాల మన్నిక కలిగి ఉంటాయని అన్నారు. కోనేరు సత్యప్రసాద్, కూరపాటి అజయ్‌కుమార్, విశ్రాంత అటవీశాఖ అధికారి రాజేంద్ర, కృత్రిమ అవయవ కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

వేతన బకాయి కోసం పాఠశాలల కార్మికుల ఆందోళన

చాట్రాయి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వేతన బకాయి విడుదల చేయాలని పాఠశాల పారిశుధ్య కార్మికులు, మధ్యాహ్న భోజన ఏజన్సీల హెల్పర్లు ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన నిర్వహించారు. వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు మాట్లాడుతూ కొద్ది పాటి జీతాలతో బతుకుతున్న వారిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. తక్షణం వీరికి జీతాలు విడుదల చెయ్యకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్మిక సంఘాల నాయకులు విజయకుమారి, అంజమ్మ, అగ్నిసు, ఏసు, బాయమ్మ, నాగేసు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కైకలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): చిగురుకోట సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల నిమిత్తం మంగళవారం మధ్యాహ్నం 1.30 నుంచి 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆ శాఖ ఈఈ జీబీ శ్రీనివాసరావు తెలిపారు. కలిదిండి మండలంలో పోతుమర్రు, మూలలంక పరిధిలో సబ్‌స్టేషన్ల పరిధిలోను సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు తెలిపారు.

పెన్షన్ల పంపిణీ నుంచి మినహాయించండి

కైకలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రతీ నెలా ప్రభుత్వం అందించే సామాజిక పెన్షన్ల డ్యూటీల నుంచి అంగన్వాడీ వర్కర్లను మినహాయించాలని అంగన్వాడీ వర్కర్లు డిమాండ్ చేస్తూ సోమవారం ఎంపీడీవో రెడ్డిబత్తుల ఫణీంద్రకు వినతిపత్రం అందజేశారు. అంగన్వాడీ వర్కర్లు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా స్కూల్స్‌లో విధులు నిర్వహిస్తున్నామని, జూలై నుంచి రాష్ట్రప్రభుత్వం పెన్షన్లు ఇచ్చే బాధ్యతలను కొన్నిచోట్ల అంగన్వాడీలకు అప్పగించారన్నారు. స్త్రీశిశు సంక్షేమ శాఖ కమిషనర్ నుంచి ఎలాంటి ఆదేశాలు లేకపోయినా కొంతమంది ఎంపీడీవోలు బలవంతంగా అంగన్వాడీల ద్వారా పెన్షన్ల పంపిణీ చేయిస్తున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే పెన్షన్ల పంపిణీ నుంచి అంగన్వాడీలను తొలగించాలని కోరారు. యూనియన్ నాయకులు సుగుణ, మీనా, కల్యాణి, కవిత, భవాని, చిన్నితల్లి తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవోకు వినతి

ముదినేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ముదినేపల్లి మండల శాఖ నాయకులు సోమవారం ఎంఈవో కె.నరేష్ కుమార్‌కు మెమొరాండం అందజేశారు. ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్, మండల శాఖ అధ్యక్షుడు కృపాకర్, ప్రధాన కార్యదర్శి వెంకట రత్నం, జిల్లా నాయకులు నాగమల్లేశ్వరరావు, రెడ్డి శ్రీనివాసరావు, హరిబాబు ఎంఈవోకు అందజేశారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల స్థాయిలో నిర్వహించ తలపెట్టిన కార్తీక వనసమారాధనకు ఏపీటీఎఫ్‌కు చెందిన ఉపాధ్యాయులు విరాళాలు ఇచ్చేందుకు విముఖత వ్యక్తం చేస్తూ ఆ మెమొరాండంలో పేర్కొన్నారు.



ఎంఈవో నరేష్‌కు మెమొరాండం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

ముసునూరులో ఉచిత పశువైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

ముసునూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కృష్ణామిల్క్ యూనియన్ (విజయ డెయిరీ), పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ముసునూరులో సోమవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా బోర్డు డైరెక్టర్ శనగల వెంకట శివజ్యోతి ప్రారంభించారు. పశు వైద్యాధికారి ఎం.వెంకట చైతన్య సుమారు 100 పశువులకు పేడ, రిపిట్ బ్రీడింగ్(తిరిగి పొల్లడం), సూడి పరీక్షలు చేసి చికిత్సనందించారు. ధర్మాజీగూడెం పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లింగయ్య పరిశీలించి పాడి పశువుల్లో వచ్చే సమస్యలు, వారి నివారణకు తీసుకోవాల్సి చర్యలపై పశుపోషకులకు అవగహన కల్పించారు. అనంతరం రైతులకు మందులను పంపిణీ చేశారు. మేనేజర్ మాగంటి హరిబాబు, విజయ డెయిరీ డీడీ లింగం ప్రసాద్, పాల సొసైటీ అధ్యక్షుడు జి.ఏడుకొండలు, సూపర్‌వైజర్లు, వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

లింగ వివక్షకు తావివ్వద్దు

ఆగిరిపల్లి, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): లింగ వివక్షకు తావులేకుండా చర్యలు చేపట్టాలని ఏపీఎం దయాల రాజశేఖర్ అన్నారు. నేషనల్ జెండర్ క్యాంపెయిన్ - నయి చేతన 3.0 కార్య క్రమంలో భాగంగా మహిళా సమైక్య వెలుగు కార్యాలయంలో సోమవారం సమావేశం జరిగింది. రాజశేఖర్ మాట్లా డుతూ కేంద్ర గ్రామీణ అభివృద్ధి మంత్రి త్వశాఖ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి డిసెంబర్ 23 వరకు నెలరోజుల పాటు లింగ వివక్షతకు వ్యతిరేకంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. మండల సమాఖ్య గ్రామ సమాఖ్యలలో స్వయం సహాయక సంఘాల్లో అజెండా అంశాలు పెట్టి మహిళలు వారి సమస్యల గురించి విస్తృతంగా చేర్చటం జరుగుతుందని తెలిపారు. అనంతరం ఆగిరిపల్లి మండలం మహిళా సమాఖ్య ర్యాలీ నిర్వ హించి ప్రతిజ్ఞ చేశారు. మండల సమైక్య ప్రతినిధులు, స్వయం సహాయక సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట దున్నేశారని ఫిర్యాదు

నూజివీడు టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): జంగంగూడెంలోని తన మొక్కజొన్న పంటను దున్నేశారని బాధిత రైతు అధికారులకు ఫిర్యాదు చేశారు. దేవరగుంట గ్రామానికి చెందిన సరిహద్దుదారు చేకూరి వెంకటరామయ్య దున్నివేశాడని ఎస్పీకి రైతు కొల్లి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. మీకోసం కార్యక్రమంలో ఈ మేరకు ఫిర్యాదు చేసినట్లు సత్యనారాయణ తెలిపారు. 15రోజుల క్రితం ఇదేభూమిలో వెంకటరామయ్య ఫెన్సింగ్‌రాళ్లను ధ్వంసం చేశాడని, దీనిపై నూజివీడు రూరల్ పోలీసులను ఆశ్రయించగా అతనికి హెచ్చరికలు చేసి వదిలి వేశారన్నారు. తిరిగి తన పంటను ధ్వంసం చేశాడని, ఫలితంగా రూ.లక్ష వరకు తనకు నష్టం జరిగిందని, అక్రమంగా తన పంటను ధ్వంసం చేసిన సరిహద్దుదారునిపై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కొల్లి సత్యనారాయణ కోరారు.

మిషన్ శక్తి పథకం పకడ్బందీగా అమలు చేయాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న నాగలక్ష్మీ

మండవల్లి నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలు, మహిళలు రక్షణ, భద్రతకోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మిషన్ శక్తి పథకం పకడ్బందీగా అమలు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ వెంకటనాగలక్ష్మీ అన్నారు. సోమవారం లోకుముడి సెక్టార్ పరిధిలో ఇంగిలిపాకలంక జిల్లా పరిషత్ హైస్కూల్లో మిషన్‌శక్తి కార్యక్రమాల్లో భాగంగా కిశోర బాలికలకు అవగాహన సమావేశం నిర్వహించారు. చైల్డ్ హెల్ప్‌లైన్ నెంబర్ 112,108, 1098లపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కార్యకర్త జ్యోతి, ఎఎన్ఎం పద్మజ, ఆశావర్కర్ జ్యోతి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు, నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న మానవత సేవా స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు

ప్రణాళికాబద్ధంగా విద్యనభ్యసించాలి

కైకలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రణాళికబద్ధంగా విద్యనభ్యసిస్తే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ అన్నారు. ఆలపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో 9, 10వ తరగతి విద్యార్థులకు సోమవారం మానవతా సేవా స్వచ్చంద సంస్థ ఆధ్వర్యంలో కెరియర్ గైడెన్స్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. 9, 10వ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహ కాలను అందజేశారు. హెచ్ఎం సీహెచ్ సారథి, మానవత సంస్థ కోచైర్మన్ గుర్రం శ్యాంకుమార్, కన్వీనర్ తలారి వేణుగోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వడాలి వద్ద అన్నవరం ఛానల్‌పై వంతెన వద్ద ప్రమాదస్థితి

ప్రమాదకరంగా వడాలి వంతెన

ముదినేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం వడాలి - అప్పారావుపేట రోడ్డులో అన్నవరం ఛానల్‌పై ఉన్న వంతెన ప్రమాదకరంగా మారింది. ఈ వంతెనకు ఒకవైపు సిమెంట్ సైడ్ గోడలు కూలిపోవడం, రెయిలింగ్ విరిగిపోవడం, రోడ్డు కోసుకు పోవడంతో పెద్ద వాహనాలు పక్కకు వెళ్లాలంటే భయమేస్తోంది. వంతెన పునాదులు బీటలు వారుతున్నాయి. వంతెన వద్ద రోజు రోజుకీ రోడ్డు కోసుకుపోతోంది. గత పదేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా వంతెన మరమ్మతులకు తమకు సంబంధం లేదని పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. మండల పరిషత్ నిధులతోనైనా వంతెనకు మరమ్మతులు చేయించాలని వడాలి, అప్పారావుపేట గ్రామస్థులు కోరుతున్నారు.



చెక్కులను అందిస్తున్న ముద్దరబోయిన

పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం

నూజివీడు, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): పేదల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. నూజివీడులోని ఆయన కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు లను సోమవారం లబ్ధిదారులకు అందించారు. ఆరోగ్యశ్రీ వర్తించని కొన్ని కేసులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సీఎం చంద్రబాబు ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నార న్నారు. ఆగిరిపల్లి మండలం వడ్లమాను గ్రామానికి చెందిన తులిమెల్లి వెంకట రమణకు రూ. 51,278 చెక్కును అందించారు. తాళం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు 4 అర్జీలు

నూజివీడు టౌన్, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): సమస్యలపై వచ్చిన అర్జీలకు నిర్ణీత సమయంలో పరిష్కారం చూపాలని సబ్ కలెక్టర్ ఏవో ఉదయ్‌భాస్కర్ అధికారులకు సూచించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీకోసంలో వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. మొత్తం నాగులు అర్జీలు దాఖలైనట్లు ఆయన తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధార్మిక భవనం ప్రారంభం

చాట్రాయి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య ఖమ్మం జిల్లా జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం ఆవరణలో రూ 45 లక్షలతో నిర్మించిన ధార్మిక భవనాన్ని సోమవారం ప్రారంభించారు. రామకోటయ్య ధనలక్ష్మి దంపతులు, కుటుంబ సభ్యులకు వేద పండితులు ఆశీర్వచనాలు అందజేశారు.

ఆర్యవైశ్య సంఘ కార్యవర్గం ఎన్నిక

నూజివీడు టౌన్, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): ఆర్యవైశ్య సంఘం మండల కార్యవర్గం ఎన్నిక శనివారం రాత్రి నిర్వహించారు. అధ్యక్షుడిగా చిన్నం శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా దోసపాటి రామును ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా మారేపల్లి వెంకట సతీష్ కుమార్, కోశాధికారిగా తటవర్తి కుమార వెంకటేశ్వరరావు, వాసవి సేవాదళ్ చైర్మన్ తాతా ప్రసాద్‌లు ఎన్నికయ్యారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరై ప్రమాణ స్వీకారం చేయించారు.

నీటి సంఘాల ఎన్నికలపై పీవో, ఏపీవోలకు నేడు శిక్షణ

ముదినేపల్లి, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): సాగునీటి వినియోగదారుల ఎన్ని కల నిర్వహణకు నియమితులైన పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులకు మంగళవారం శిక్షణ నిర్వహించను న్నట్టు తహసీల్దార్ ఎస్.కె.సుభానీ తెలిపారు. ముదినేపల్లిలోని వి.కన్వెన్షన్ హాలులో ఉదయం 10.30 గంటలకు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని 13 సాగునీటి సంఘాలు ఎన్నికల నిర్వహణకు 13 మంది పోలింగ్ అధికా రులు, 13 మంది ఏపీవోలను నియమించారని, వారికి మాస్టర్ ట్రైనీలు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై శిక్షణిస్తారని తెలిపారు.

1,205 పట్టభద్రుల ఓటర్లు

ముదినేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణా - గుంటూరు జిల్లాల పట్ట భద్రుల శాసన మండలి ఎన్నికలకు మం డలంలో 1,205 మంది ఓటర్లు నమో దయ్యాయని తహసీల్దార్ ఎస్.కె.సుభానీ తెలి పారు. మండలంలో 649 మంది పురుషులు, 556 మంది మహిళా పట్టభద్రులు ఓటు హక్కు పొందారని తెలిపారు. ఓటర్ల జాబి తాల్లో సవరణలకు, 2021 నవంబరు 1 నాటి కి డిగ్రీ పూర్తి చేసిన వారికి ఓటు లేకపోతే డిసెంబరు 9 లోపు కొత్తగా దరఖాస్తు చేసు కోవచ్చన్నారు.

ప్రకృతి పరీక్షన్ అభియాన్

ముదినేపల్లి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ప్రకృతి పరీక్షన్ అభియాన్ అనే కార్య క్రమాన్ని ఈనెల 26 నుంచి డిసెంబరు 25 వరకు పెదగొన్నూరులోని ప్రభుత్వ ఆయు ర్వేద ఆస్పత్రిలో నిర్వహించనున్నట్టు ఆస్ప త్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ చల్లా సుభాష్ చంద్రబోస్ తెలిపారు.

కోళ్ల వ్యర్థాల రవాణాపై చర్యలు : ఎస్ఐ

ముదినేపల్లి, నవంబరు 25 (ఆంధ్ర జ్యోతి): నిషేధిత కోళ్ల వ్యర్థాల రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి పెడతామని ముదినేపల్లి ఎస్ఐ వి.ఎస్.వీరభద్రరావు తెలి పారు. అనుమానిత వాహనాలను తనిఖీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని, రాత్రి ళ్లలోడు వాహనాలపై ప్రత్యేక దృష్టి పెడ తామన్నారు. స్టేషన్ పరిధిలో నైట్ బీట్ పోలీసు సిబ్బందిని ఈ విషయంపై అలర్ట్ చేస్తామని, చెక్ పోస్టుల వద్ద వాహనాల్లో రవాణా చేస్తున్న సరుకును, పర్మిట్లను పరిశీలించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు.

విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

కైకలూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు అదాలత్, అవగాహన సదస్సును ఈ నెల 27, 28 తేదీల్లో కైకలూరులో నిర్వహించనున్నట్టు విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసరావు తెలిపారు. 27 ఉదయం 10.30 నుంచి 1.30 వరకు కైకలూరు సీతారామ ఫంక్షన్ హాలులో కన్స్యూమర్ గ్రీవెన్స్ ఫోరమ్స్ చైర్మన్ విక్టర్ ఇమ్మానియేల్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహిస్తామని, గుడివాడ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.